http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 23 జూన్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం
- ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారణ
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

## వాయుసేన విమానాశ్రయానికి
# సహకరిస్తాం

- రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ.. 20 నిమిషాలపాటు చర్చ
- వాయుసేన టెర్మినల్‌తోపాటు కార్గో, ఎమ్ఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలు కల్పించాలి
- రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి భేటీ
- మెట్రో ఫేజ్-2 అనుమతులపై చర్చ
- మూడు రోజుల ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- మెట్రోరైలు ఫేజ్-2కు అనుమతులపై అశ్వినీవైష్ణవ్‌తో చర్చ



హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వీనీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన రైల్వేమంత్రితో రైల్‌భవన్‌లో సమావేశం అయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 అనుమతుల అంశంపై ఆయనతో చర్చించారు. ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలకు సంబంధించిన అంశాలపై కూడా సమీక్షించినట్లుగా సమాచారం. ఇటీవల కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖను రాసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ నగరంలో మెట్రో రైలుకు ఐఆర్ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేవిధంగా చూడాలని లేఖలో కోరిన విషయం తెలిసిందే. రైల్వేమంత్రి అశ్వీనీ వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే ముగ్గురు సమావేశం అవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతకు ముందు, రక్షణ - మిగతా3లో



## స్థానికతపై ద్వంద్వ విధానం తగదు

- స్థిరమైన ప్రమాణాలను పాటించాలన్న హైకోర్టు
- టీజీపీఎస్సీ అప్పీల్ పిటిషన్ కొట్టివేత
- అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో చదువలేదు
- కారణంతో అభ్యర్థిని స్థానికుడిగా గుర్తించలేదు



## బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం..

- ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!
- లేబర్ పార్టీ నాయకత్వాన్నీ వీడుతున్నట్లు ప్రకటన

## టెక్నాలజీ వినియోగం నుంచి సృష్టికర్తగా.. డిజిటల్ రంగంలో గ్లోబల్ పవర్‌హౌజ్‌గా భారత్

- గత 12 ఏళ్లలో గ్లోబల్ డిజిటల్ శక్తిగా ఎదిగిన భారత్
- 102 కోట్లకు చేరిన ఇంటర్నెట్ కనెక్షన్లు.. భారీగా పెరిగిన బ్రాడ్‌బ్యాండ్
- ఏఐ, సెమీకండక్టర్ల రంగంలో భారీ పెట్టుబడులు, కీలక ప్రాజెక్టులు




## రెండో విడతలో పూరిళ్లకే
# అధిక ప్రాధాన్యం

- 'షీర్‌వాల్' పద్ధతిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- నిర్మాణ వ్యయాలను దృష్టిలో పెట్టుకుని సర్కార్ కొత్త నిర్ణయం
- రాష్ట్రవ్యాప్తంగా 24 వేల పూరిళ్లను గుర్తించిన అధికారులు
- 15 రోజుల్లోనే ఇంటి నిర్మాణం పూర్తి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మణానికి కొత్త పద్ధతి



హైదరాబాద్

ప్రతి మధ్యతరగతి, పేద కుటుంబాలకు సొంత ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా వారంతా పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు సహాయపడుతోంది. దీంట్లో భాగంగానే మొదట విడత ఇళ్లు మంజూరు చేశారు. దానికి అనుగుణంగా విడతల వారిగా నిధులను కేటాయిస్తున్నారు. ప్రస్తుతం రెండో విడత ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం సిద్ధమైతుంది. దీంట్లో ప్రధానంగా గుడిసెలలో - మిగతా3లో

## ఉద్ధవ్ థాకరేకు భారీ షాక్..



- షిండే వర్గంలో చేరిన ఆరుగురు ఎంపీలు
- లోక్‌సభలో 9 నుంచి 3కి పడిపోయిన యూబీటీ బలం
- ఆపరేషన్ టైగర్ విజయవంతమైందన్న ఏక్‌నాథ్ షిండే
- అభివృద్ధి నిధుల కోసమే పార్టీ మారామంటున్న ఎంపీలు
- ఎన్నికల తర్వాత అమ్ముడుపోయారంటూ ఉద్ధవ్ ఫైర్

## నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు



- ఆర్డీఎస్, తుంగభద్ర జలాలపై ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉత్తమ్ సమీక్ష
- తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్న ఉత్తమ్
- జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు

హైదరాబాద్

తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో - మిగతా3లో




## భారత్‌లో డేటా సెంటర్ల విప్లవం.. ఏఐతో భారీ డిమాండ్!

- ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌తో భారత్‌లో పెరుగుతున్న డేటా సెంటర్ల డిమాండ్
- గోల్డ్‌మన్ సాక్స్ నివేదికలో కీలక అంశాల వెల్లడి
- ఆసియాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌గా గుర్తింపు
- ముంబై, చెన్నై ప్రధాన కేంద్రాలుగా వేగంగా విస్తరణ

## సన్నాలకే
# పెద్దపీట

### ఈసారి ఈ 7 రకాల సన్నాలకే ప్రభుత్వ బోనస్

- విత్తనాలు కొనే ముందు ఓసారి చూసుకోండి
- 7 రకాల సన్నవడ్లనే పండించాలని రైతులకు సూచిస్తున్న సర్కారు
- వాటికి మాత్రమే బోనస్ బోనస్ ఇవ్వాలని యోచన
- ఈనెల 23 నుంచి విత్తన మేలాలు నిర్వహించి, ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని నిర్ణయం



హైదరాబాద్

రాష్ట్రంలో ఏటా రైతులు 33 రకాలైన సన్న వరి సాగు చేసేవారు. వీటిల్లో కొన్ని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరిస్తుండగా, మిగతావి ప్రైవేటు మిల్లర్లు కొంటున్నారు. రైస్ మిల్లర్లు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అన్నదాతలను ఇబ్బందులు పెడుతున్నారు. కొంతమంది మీరు పండించిన ధాన్యం రకం కొనలేమని చేతులెత్తేస్తున్నారు. మరి కొంతమంది 50 కిలోల బస్తాకు రెండు నుంచి - మిగతా3లో

# ఉద్ధవ్ థాకరేకు భారీ షాక్..



శివసేన-యూబీటీ అధినేత ఉద్ధవ్ ఠాక్రేకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు తిరుగుబాటు ఎంపీలు అధికారికంగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే నేతృత్వంలో శివసేనలో చేరారు. దక్షిణ ముంబయిలోని వై.బి.చవాన్ సెంటర్‌లో ఏకనాథ్ శిండే సమక్షంలో వీరు పార్టీ కండువా కప్పుకున్నారు. లోక్‌సభలో శివసేన ఖదీకి మొత్తం తొమ్మిది మంది ఎంపీలు ఉండగా, అందులో ఏకంగా ఆరుగురు పార్టీ మారారు. ఈ పరిణామంతో లోక్‌సభలో శిండే వర్గం శివసేన ఎంపీల బలం 7 నుంచి 13కి పెరిగింది. మూడింట రెండొంతుల మెజారిటీ ఎంపీలు శివసేన-ఖదీని వీడటంతో వీరిపై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడే అవకాశం లేదు.

**ఊహాగానాలకు తెర**

గత కొన్ని రోజులుగా సాగుతున్న రాజకీయ ఉత్కంఠకు, ఊహాగానాలకు తెరదించుతూ, శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు- సంజయ్ హరిభావూ జాదవ్, సాహెబ్ రాజారామ్ వాక్‌చౌరే, ఓంప్రకాశ్ భూపాల్ సింగ్, నింబాల్కర్, సంజయ్ దినా పాటిల్, సంజయ్ ఉత్తమ్ రావ్ దేశ్‌ముఖ్, నగేశ్ బాపూరావ్ పాటిల్ అస్తికర్ సోమవారం ఏక్‌నాథ్ శిండే వర్గంలో చేరారు. ఈ సందర్భంగా ఏక్‌నాథ్ శిండే విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.

"శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు ఇవాళ మా పక్షంలో చేరారు. అసలైన శివసేనను కాపాడుకునేందుకు 2022లో జరిగిన రాజకీయ చీలికకు ఇది కొనసాగింపు. ఈ ఎంపీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కాకుండా, తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసమే మా పార్టీలో చేరారు. బాలాసాహెబ్ ఠాక్రే, ఆనంద్? దిఘేల అసలైన శివసేనలోకి ఈ ఆరుగురు కట్టర్ శివసైనిక్ ఎంపీలను మేము స్వాగతిస్తున్నాం. 2022లో బాలాసాహెబ్ శివసేనను రక్షించుకోవడానికి 40 మంది ఎమ్మెల్యేలతో కలిసి మేము తిరుగుబాటు చేశాం. ఇది అదే ఉద్యమానికి చెందిన రెండో దశ. శివసేన సిద్ధాంతాలను, బాలాసాహెబ్? ఆశయాలను కాపాడడమే మా లక్ష్యం. అందుకే ఈ ఎంపీలు అసలైన శివసేనలోకి రావాలని నిర్ణయించుకున్నారు. దీనితో ఆపరేషన్ టైగర్ సక్సెస్ అయ్యింది."

**మా దగ్గర చాలా మంది 'సంజయ్'లు ఉన్నారు!**

ఇదే సమయంలో తిరుగుబాటు ఎంపీలపై విమర్శలు గుప్పిస్తున్న శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్‌పై శిండే తనదైన శైలిలో చమత్కార బాణాలు వదిలారు. "ఈ రోజు ఆరుగురు ఎంపీలు మాతో చేరారు. కాబట్టి ఇప్పుడు మా వద్ద ముగ్గురు 'సంజయ్'లు ఉన్నారు. వీరితోపాటు మా ఎమ్మెల్యే సంజయ్? రాథోడ్? కూడా ఇక్కడే ఉన్నారు. మా వద్ద ఇంత మంది సంజయ్?లు ఉన్నప్పుడు, ఇక వేరే సంజయ్ (రౌత్) గురించి మాట్లాడాల్సిన అవసరం లేదు. నేను ఎవరి గురించి మాట్లాడుతున్నానో మీకు తెలుసు కదా" అని అన్నారు.

**మాకు ప్రజల మద్దతు ఉంది!**

2022లో తాము చేసిన తిరుగుబాటుకు ప్రజల మద్దతు లభించిందని, ప్రస్తుతం శివసేనకు 60 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని ఏక్?నాథ్ శిండే పేర్కొన్నారు. "ఓంరాజే నింబాల్కర్? తన కార్యకర్తలతో చర్చించిన తర్వాత, పెద్ద మనస్సుతో మా వద్దకు వచ్చారు. ప్రజలు ఆయన్ను రీల్ స్టార్ అంటారు. కానీ నా దృష్టిలో ఆయన రియల్ స్టార్?. వీరంతా తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాలేదు. తమ నియోజకవర్గాల బాగు కోసం వచ్చారు. 2022లో మేము తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు అంగీకరించారు. ఆ తర్వాత మేము ప్రజా కోర్టులో(ఎన్నికల్లో)కి వెళ్లినప్పుడు ప్రజలు మమ్మల్ని ఆదరించారు. మేము తిరుగుబాటు చేసినప్పుడు మా వద్ద కేవలం 40 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. కానీ ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మా బలం 40 నుంచి 60కి పెరిగింది" అని శిండే గుర్తుచేశారు.

**ఆపరేషన్ టైగర్ సక్సెస్?**

2022లో శిండే పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఉద్ధవ్ ఠాక్రే నుంచి విడిపోయి, పార్టీని రెండుగా చీల్చిన సంగతి తెలిసిందే. లోక్?సభలో శివసేన (యూబీటీ)కి 9 మంది ఎంపీలు ఉన్నారు. కానీ గతవారం శివసేన (యూబీటీ) పిలిచిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి కేవలం 3 లోక్?సభ ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. దీనితో తిరుగుబాటు చేసిన ఆరుగురు ఎంపీలపై క్రమశిక్షణా చర్యలు చేపట్టినట్లు ఉద్ధవ్ ఠాక్రే వర్గం ప్రకటించింది. ఈ నేపథ్యంలో వారు శిండే వర్గంలో చేరడంతో ఆపరేషన్ టైగర్ సక్సెస్ అయ్యిందని చెప్పవచ్చు.

# బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం..



బ్రిటన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ (63) తన పదవికి, అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని చెప్పారు. "నేను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నాను" అని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పలు రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, వేతనాల పెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల, కార్మికులు-అద్దెదారుల హక్కుల బలోపేతం వంటి అంశాలను ప్రస్తావించారు. రక్షణ వ్యయాన్ని పెంచడం, అక్రమ వలసలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం, చిన్నారుల పేదరికం తగ్గించే కార్యక్రమాలు అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన విజయాలని పేర్కొన్నారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం దేశ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక సవాళ్లు, అక్రమ వలసల వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు బ్రిటన్‌లో పెరుగుతున్నాయి.

## టెక్నాలజీ వినియోగం నుంచి సృష్టికర్తగా..

# డిజిటల్ రంగంలో గ్లోబల్ పవర్‌హౌజ్‌గా భారత్




గడిచిన 12 ఏళ్లలో భారతదేశం ప్రపంచ డిజిటల్ శక్తిగా అవతరించింది. ఒకప్పుడు కేవలం టెక్నాలజీ వినియోగదారుగా ఉన్న దేశం.. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీస్, డేటా సెంటర్లు వంటి అత్యాధునిక రంగాల్లో ప్రపంచ స్థాయి పరిష్కారాలను సృష్టించే స్థాయికి ఎదిగింది. బలమైన ప్రభుత్వ విధానాలు, విస్తరిస్తున్న డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం ఈ మార్పునకు దోహదపడ్డాయని సోమవారం విడుదల చేసిన అధికారిక ఫ్యాక్ట్-షీట్ వెల్లడించింది.

**'డిజిటల్ ఇండియా' కార్యక్రమం కీ రోల్**

ఈ భారీ పరివర్తనకు 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం కీలక పాత్ర పోషించింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2014లో 25.15 కోట్లుగా ఉన్న ఇంటర్నెట్ కనెక్షన్లు 2026 నాటికి 102 కోట్లకు పైగా పెరిగాయి. ఇదే సమయంలో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు 6.1 కోట్ల నుంచి దాదాపు 100 కోట్లకు చేరాయి. దేశవ్యాప్తంగా ఆప్టికల్ ఫైబర్ కవరేజీ 42 లక్షల రూట్ కిలోమీటర్లకు పైగా విస్తరించగా, దాదాపు అన్ని జిల్లాలకు 5+ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అత్యాధునిక టెక్నాలజీల రంగంలోనూ భారత్ తన సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకుంది. 'నేషనల్ సూపర్ కంప్యూటింగ్ మిషన్' కింద దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో 47 పెటాఫ్లాప్‌ల సామర్థ్యంతో 38 సూపర్ కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. వీటిలో దేశీయంగా అభివృద్ధి చేసిన 'పరం రుద్ర' వంటి సిస్టమ్స్ కూడా ఉన్నాయి. అదేవిధంగా రూ.10,300 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభించిన 'ఇండియాఏఐ మిషన్' ద్వారా 38,000కు పైగా జీపీయూలతో కూడిన కంప్యూటింగ్ సదుపాయాన్ని నిర్మిస్తున్నారు. 'ఏఐ కోశ్' ప్లాట్‌ఫామ్‌లో ఇప్పటికే 20 రంగాలకు చెందిన 12,000కు పైగా డేటాసెట్లు, 300కు పైగా ఏఐ మోడల్స్ అందుబాటులో ఉన్నాయి.

**మంచి ఫలితాలిస్తోన్న 'సెమికాన్ ఇండియా'**

సెమీకండక్టర్ల తయారీలో స్వావలంబన కోసం రూ.76,000 కోట్లతో ప్రారంభించిన 'సెమికాన్ ఇండియా' కార్యక్రమం మంచి ఫలితాలనిస్తోంది. ఇప్పటివరకు సుమారు రూ.1.64 లక్షల కోట్ల విలువైన 12 ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటిలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీ, చిప్ ప్యాకేజింగ్ ప్లాంట్లు ఉన్నాయి. మరోవైపు, క్వాంటం టెక్నాలజీలోనూ భారత్ ముందంజ వేస్తోంది. రూ.6,003.65 కోట్ల కేటాయింపులతో 'నేషనల్ క్వాంటం మిషన్'ను ప్రారంభించి, పలు స్టార్టప్‌లకు మద్దతు ఇస్తోంది. ఇటీవల 1,000 కిలోమీటర్ల దూరానికి సురక్షితమైన క్వాంటం కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను విజయవంతంగా ప్రదర్శించింది. దేశంలో డేటా సెంటర్ల సామర్థ్యం కూడా వేగంగా పెరుగుతోంది. 2020లో 375 మెగావాట్లుగా ఉన్న సామర్థ్యం, 2025 నాటికి నాలుగు రెట్లు పెరిగి దాదాపు 1,500 మెగావాట్లకు చేరింది. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, నోయిడా, జామ్‌నగర్ ప్రధాన హబ్‌లుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇక డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) విషయంలో ఆధార్, యూపీఐ, డిజిలాకర్, కోవిన్ వంటి ప్లాట్‌ఫామ్‌లతో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది. డీపీఐ సహకారం కోసం ఇప్పటికే 23 దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకోగా, సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, నేపాల్, శ్రీలంక వంటి దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

**గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 38వ స్థానానికి మెరుగుపడిన ర్యాంకు**

ఈ స్థిరమైన ప్రగతి ఫలితంగా 'గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్'లో భారత్ ర్యాంకు 2015లో 81వ స్థానం నుంచి 2025 నాటికి 38వ స్థానానికి మెరుగుపడింది. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరిశోధనలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులపై పెడుతున్న పెట్టుబడులతో భవిష్యత్ టెక్నాలజీలకు, ఆవిష్కరణలకు భారత్ విశ్వసనీయమైన గ్లోబల్ హబ్‌గా మారుతోందని ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది.

## లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి



ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో ఉన్న ఓ మూడు అంతస్తుల భవనంలోని కోచింగ్ సెంటర్‌లో చెలరేగిన మంటల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, పురానియాలోని ఓ వాణిజ్య భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే దట్టమైన పొగ భవనం మొత్తాన్ని చుట్టుముట్టడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పై అంతస్తుల నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారంతా 20 నుంచి 24 ఏళ్లలోపు వయసు వారేనని అధికారులు తెలిపారు. ఈ ప్రమాద వార్త తెలియగానే ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, అలీగఢ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పర్యటనను అర్థాంతరంగా రద్దు చేసుకుని లక్నోకు తిరిగి వచ్చారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. భవనం గోడలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## భారత్‌లో డేటా సెంటర్ల విప్లవం..
## ఏఐతో భారీ డిమాండ్!




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఆసియాలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ అవతరిస్తోందని ప్రముఖ అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ సాక్స్ తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలోని యువ జనాభా, అపారమైన ఇంజినీరింగ్ నైపుణ్యం కలిగిన మానవవనరులు, ప్రభుత్వ సానుకూల విధానాలు ఈ రంగానికి మరింత ఊతమిస్తున్నాయని వివరించింది. దేశంలో ముంబై, చెన్నై నగరాలు డేటా సెంటర్లకు ప్రధాన గమ్యస్థానాలుగా మారాయి. సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల లభ్యత ఇందుకు ప్రధాన కారణం కాగా, ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు నగరాలు కొనసాగుతున్నాయి. వీటికి తోడు పశ్చిమాసియా దేశాలకు వ్యూహాత్మకంగా చేరువలో ఉండటం కూడా భారత్‌కు కలిసొచ్చే అంశమని నివేదిక పేర్కొంది. ఈ రంగానికి సంబంధించిన తాజా గణాంకాలు కూడా ఇదే వృద్ధిని ధ్రువీకరిస్తున్నాయి. నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, దేశంలోని డేటా సెంటర్ల సామర్థ్యం గత ఏడాది చివరి నాటికి 1.6 గిగావాట్లకు చేరుకుంది. ప్రస్తుతం మరో 0.32 గిగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు నిర్మాణ దశలో ఉండగా, 2.92 గిగావాట్ల సామర్థ్యం పనుల కోసం వివిధ సంస్థల మధ్య చర్చలు జరుగుతున్నాయి.

## కొండ కింద డ్రోన్ సామ్రాజ్యం..
## హెజ్బొల్లాకు భారీ షాక్ ఇచ్చిన ఇజ్రాయెల్!



ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. దక్షిణ లెబనాన్‌లోని ఓ కొండ కింద భారీ భూగర్భ డ్రోన్ కేంద్రాన్ని గుర్తించినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఇరాన్ మద్దతుతో హెజ్బొల్లా ఈ కేంద్రాన్ని నిర్మించిందని ఆరోపించింది. ఇక్కడ డ్రోన్ల తయారీతో పాటు వాటిని ఇజ్రాయెల్‌పై ప్రయోగించే ఏర్పాట్లు కూడా ఉన్నట్లు వెల్లడించింది. లెబనాన్‌లోని మజ్దల్ జౌన్ గ్రామం సమీపంలో ఈ భూగర్భ కేంద్రం ఉన్నట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇది దేశ సరిహద్దుకు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇటీవల నిర్వహించిన సైనిక చర్యల్లో ఈ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్న తర్వాత సొరంగ మార్గాలు బయటపడినట్లు పేర్కొంది. సైనిక అధికారుల వివరాల ప్రకారం, ఈ సొరంగ వ్యవస్థ కొండ లోపల వందల మీటర్ల మేర విస్తరించి ఉంది. దాదాపు 29 మీటర్ల లోతులో నిర్మించిన ఈ కేంద్రానికి భారీ ఉక్కు తలుపులతో రక్షణ కల్పించారు. గతంలో గుర్తించిన హెజ్బొల్లా సొరంగాల కంటే ఇది అత్యంత ఆధునికంగా నిర్మించినట్లు ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. సొరంగం లోపల డ్రోన్ల తయారీకి ఉపయోగించే పరికరాలు, విడిభాగాలు గుర్తించినట్లు సైన్యం వెల్లడించింది. అలాగే సుమారు 50 డ్రోన్లు కూడా లభించినట్లు తెలిపింది. వాటిలో ఒక్కో డ్రోన్‌కు దాదాపు 30 కిలోల పేలుడు పదార్థం అమర్చినట్లు పేర్కొంది. ఈ డ్రోన్లు ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం కలిగి ఉన్నాయని అధికారులు తెలిపారు. అంతేకాకుండా కేంద్రంలో సుమారు ఎనిమిది టన్నుల పేలుడు పదార్థాలు నిల్వ ఉంచినట్లు వెల్లడించారు. ఈ తరహా డ్రోన్లను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి అని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. కొండ దక్షిణ భాగంలో ప్రత్యేక డ్రోన్ ప్రయోగ మార్గాలను కూడా గుర్తించినట్లు సైన్యం తెలిపింది. అవసరమైనప్పుడు భారీ తలుపులు తెరిచి డ్రోన్లను నేరుగా ఇజ్రాయెల్ వైపు ప్రయోగించేలా ఈ వ్యవస్థను రూపొందించినట్లు వివరించింది.

# రెండో విడతలో పూరిళ్లకే అధిక ప్రాధాన్యం

-మొదటిపేజీ తరువాయి
నివసించేవారినే లక్ష్యంగా తీసుకోనుంది. అలాగే వీరికి 'షీర్?వాల్'? టెక్నాలజీ పద్ధతిలో ఇంటి నిర్మాణాన్ని చేపట్టేందుకు ఏర్పాటు చేస్తోంది.

**రాష్ట్రవ్యాప్తంగా 24వేల పూరిళ్లు**

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఆ క్రమంలో పూరిళ్లలో నివసిస్తున్న వారిని గుర్తించారు. అప్పుడు ప్రాథమికంగా రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల మంది పూరి గుడిసెల్లో నివసిస్తున్నట్లు తేలింది. దీంతో రెండో విడతలో గుడిసెల్లో నివసించే వారికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే షీర్‌వాల్ టెక్నాలజీ పద్ధతిలో ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా హౌసింగ్ కార్పొరేషన్ ప్రణాళికలు రూపొందిస్తోంది.

**నిర్మాణ వ్యయానికి చెక్!**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పేరిట ప్రభుత్వం నాలుగు విడతలుగా రూ. 5 లక్షలను విడుదల చేస్తోంది. అయితే ప్రస్తుతం ఇటుక, సిమెంట్, ఐరన్, ఇసుక వంటి ముడి వస్తువులకు భారీగా ధరలు పెరిగిపోయాయి. దీనివల్ల ప్రభుత్వం అందించే సహాయంతో పాటు వారికి ఇంకా అదనంగా ఖర్చు అవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పూరిళ్లలో నివసించే వారు ముందుగా డబ్బులు పెట్టి నిర్మించుకోలేరు. అందుకే ప్రభుత్వం షీర్‌వాల్ పద్ధతిలో ఇంటిని నిర్మించి ఇస్తామని అంటుంది.

**నమూనా ఇల్లు నిర్మాణం**

ఈ షీర్‌వాల్ టెక్నాలజీని ఉపయోగించి ఓ స్టార్టప్ కంపెనీ పోయిన సంవత్సరం సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 400 చదరపు అడుగుల్లో నమూనా ఇంటిని చేపట్టింది. ఇది



విజయవంతంగా పూర్తి అయ్యింది. ఇటీవల కుమురం భీం జిల్లా కెరమెరి మండలం కొఠారి పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో షీర్‌వాల్ పద్ధతిలోనే ఇళ్లను నిర్మించారు. పూర్తి చేసిన ఇళ్లను లబ్ధిదారులకు అందించారు.

**15 రోజుల్లోనే పూర్తి**

22.3 అడుగుల పొడవు, 18 అడుగుల వెడల్పుతో మొత్తం 400 అడుగులతో స్లాబ్ వచ్చే విధంగా సంగారెడ్డి జిల్లా జిన్నారంలో ఓ నమూనా ఇల్లు నిర్మాణం చేపట్టారు. దానికి 8ఎంఎం, 10ఎంఎం స్టీల్, రెడీమిక్స్‌డ్ సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్, అల్యూమినియం ప్యానెల్ వినియోగించారు. ఈ పద్ధతిలో ఇల్లు నిర్మాణం కోసం మొత్తం 15 రోజుల సమయం పడుతుంది. మొదట ఐదు రోజులు పునాది వేస్తారు. ఆ తర్వాత ఆరు రోజుల పాటు శ్లాబ్? నిర్మాణం ఉంటుంది. మిగిలిన నాలుగు రోజుల్లో ప్లాస్టరింగ్? వంటి పనులను పూర్తి చేస్తారు. అయితే ఇదంతా కేవలం రూ. లక్షల్లోనే ఖర్చు అవుతుంది.

# రాష్ట్రవ్యాప్తంగా స్కూల్స్‌బంద్‌కు ఏబీవీపీ పిలుపు

విద్యాసంస్థల్లో ఫీజుల పెంపు, మౌలిక వసతుల కొరత సహా విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ జూన్? 23న ఏబీవీపీ బంద్?కు పిలుపునిచ్చింది. ఈ బంద్?కు అన్నివర్గాల వారు సహకరించాలని విద్యార్థి సంఘం నాయకులు కోరారు. కార్పొరేట్?, ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీకి అడ్డకట్ట వేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర వ్యాప్త బంద్?కు పిలుపునివ్వడంతో ఇప్పటికే పలు ప్రైవేటు పాఠశాలలు మంగళవారం సెలవు ప్రకటించారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ ఫోన్‌లకు మేసేజ్‌లను పంపించారు. బంద్ కారణంగా పాఠశాలకు రేపు హాలిడే ప్రకటించినట్లుగా మేసేజ్‌లో పేర్కొన్నారు.

**ఏబీవీపీ ముఖ్యమైన డిమాండ్లు ఇవే**

ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లలో విచ్చల విడిగా ఫీజుల దోపిడీని అరికట్టేందుకు చట్టం తీసుకురావాలి.

ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించే విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఖాళీగా ఉన్న ఎంఈవో, డీఈవో పోస్టులతో పాటు బోధన, బోధనేతర సిబ్బందిని నియామకాలు చేపట్టాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలి.

విద్యార్థులకు వెంటనే యూనిఫార్మ్‌లు అందించాలి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను వెంటనే అమలు చేయాలి

ప్రైవేటు పాఠశాలల మేనేజ్ మెంట్ల ఆధ్వర్యంలో నడుస్తున్న బుక్స్, యూనిఫార్మ్ అమ్మకాలు నిషేధించాలి

ఎన్?ఈపీ 2020 అమలు చేయాలి

**విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించిన ఏఐఎస్ఎఫ్**



పాఠశాల విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ లక్డీకపూల్?లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ఇవాళ ఏఐఎస్ఎఫ్ ముట్టడించింది. ర్యాలీగా వచ్చిన నాయకులు కార్యాలయం ముందు బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కార్యాలయంలోనికి వెళ్లేందుకు యత్నించిన ఏఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు ఆందోళన కారులకు తోపులాట, వాగ్వాదం జరిగింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు తగ్గిస్తామని చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి సర్కారు పాఠశాలలను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. తెలంగాణలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించే చర్యలు చేపట్టాలని కోరారు. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఒక్క ట్వీట్ మూడు రాష్ట్రాల అలర్ట్

**హైదరాబాద్** : దేశంలోని స్పేస్-టెక్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు దక్షిణాది రాష్ట్రాల మధ్య సోషల్ మీడియా వేదికగా ఒక అపూర్వమైన వ్యూహాత్మక యుద్ధం నడుస్తోంది. ప్రముఖ అంతరిక్ష సాంకేతిక స్టార్టప్ పిక్సెల్ కో-ఫౌండర్ క్షితిజ్ ఖండేల్వాల్ చేసిన ఒకే ఒక్క పోస్ట్.. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల పారిశ్రామిక మంత్రుల మధ్య హైవోల్టేజ్ పోటీకి తెరలేపింది. బెంగళూరు శివార్లలో తమ ఉపగ్రహాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి భూమిని సేకరించడం ఎంత నరకంగా మారిందో వివరిస్తూ పిక్సెల్ కో-ఫౌండర్ క్షితిజ్ ఖండేల్వాల్ చీ లో ఒక పోస్ట్ పెట్టారు. భూమిని సేకరించడం కంటే.. అసలు అంతరిక్షంలోకి వెళ్లే ఉపగ్రహాలను తయారు చేయడమే చాలా సులభం అనిపిస్తోంది అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. బెంగళూరు లాంటి గ్లోబల్ టెక్ హబ్‌లో భూసేకరణ, అనుమతుల ప్రక్రియల్లో ఉన్న రెడ్-ట్యాపిజం ను ఈ ట్వీట్ ఎత్తిచూపడంతో పొరుగు రాష్ట్రాలు దీనిని ఒక అద్భుతమైన అవకాశంగా మార్చుకున్నాయి. ఈ పోస్టుపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి నారా లోకేష్ అత్యంత వేగంగా స్పందించారు. "క్షితిజ్.. బెంగళూరుకు సరిగ్గా ఆనుకుని, ఇన్వెస్టర్లకు స్వర్గధామం లాంటి అనంతపురం జిల్లా మన పక్కనే ఉంది. అక్కడ మేము స్పేస్ సిటీలు, ఏరోస్పేస్ పార్కులు, రెడీ-టు-గో ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్స్‌ను సిద్ధం చేస్తున్నాం. ఫౌండర్లు భూమి కోసం వేటాడుతూ సమయం వృథా చేసుకోకుండా నేరుగా ఉపగ్రహాల తయారీపై దృష్టి పెట్టవచ్చు. వెల్‌కమ్ టు ఏపీ" అంటూ లోకేష్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. దీనికి మద్దతుగా ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ కూడా కర్ణాటకను టార్గెట్ చేస్తూ.. "కొన్ని ఎకోసిస్టమ్స్ మిమ్మల్ని అనుమతుల కోసం ఆఫీసుల చుట్టూ పరిగెత్తేలా చేస్తాయి.. కానీ ఆంధ్రప్రదేశ్ మీకు నేరుగా లాంచ్ ప్యాడ్



అందిస్తుంది" అంటూ హాట్ కామెంట్స్ జోడించింది. సొంత రాష్ట్రంలోని స్టార్టప్ పొరుగు రాష్ట్రానికి తరలిపోయే ప్రమాదం ఉందని గ్రహించిన కర్ణాటక భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ వెంటనే రంగంలోకి దిగారు. క్షితిజ్ పోస్టుకు రిప్లై ఇస్తూ.. "నా ఆఫీస్ మరియు అధికారులు తక్షణమే మీతో టచ్‌లోకి వస్తారు. మీ సమస్యలను వ్యక్తిగతంగా సమీక్షించి, భూసేకరణ మరియు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేస్తాం" అని హామీ ఇచ్చారు. బెంగళూరు సిలికాన్ వ్యాలీ ట్యాగ్‌ను కాపాడుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించింది. ఈ బెంగళూరు-ఆంధ్ర వివాదంలోకి తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన అనూహ్యంగా ప్రవేశించారు. హోసూర్ సరిహద్దులో ఉన్న తమిళనాడు ఎందుకు ఈ ప్రాజెక్ట్‌ను దక్కించుకోకూడదని నెటిజన్లు ప్రశ్నించడంతో ఆమె అత్యంత హుందాగా, పవర్‌ఫుల్ కౌంటర్ ఇచ్చారు. తాము గైడెన్స్ తమిళనాడు సింగిల్ విండో సిస్టమ్ ద్వారా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఇన్వెస్టర్ వెబ్‌సైట్, చీ, లింక్డ్ఇన్, ఈమెయిల్ లేదా కేవలం ఒక చిన్న రెఫరల్.. ఇలా ఏ మార్గంలో క్వెరీ పంపినా, చిన్న ఎంట్రప్రెన్యూర్‌ను కూడా సమానంగా, అత్యంత సీరియస్‌గా తీసుకుంటామని చెప్పారు. భారతదేశంలో ఒకప్పుడు పెట్టుబడుల కోసం ఫౌండర్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. కానీ ఈరోజు, ఒక స్టార్టప్ ఫౌండర్ పెట్టిన చిన్న అసంతృప్తి ట్వీట్‌కు ముగ్గురు రాష్ట్రాల మంత్రులు పోటీ పడి మరీ నిమిషాల వ్యవధిలో పరిష్కారాలు చూపడం భారతీయ స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో వచ్చిన విప్లవాత్మక మార్పుకు నిదర్శనం. ల్యాండ్ అక్విజిషన్ , రెడ్-ట్యాపిజం వంటి పాత కాలపు అడ్డంకులను తొలగించి, ఇన్వెస్టర్లకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కల్పించడంలో దక్షిణాది రాష్ట్రాల మధ్య సాగుతున్న ఈ ఆరోగ్యకరమైన పోటీ దేశ ఆర్థిక వృద్ధిని మరింత వేగవంతం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నఅభిప్రాయం వ్యక్తమవుతోంది.

## సన్నాలకే పెద్దపీట

-మొదటిపేజీ తరువాయి
4 కేజీల తరుగును తీస్తున్నారు. వీటిని గుర్తించిన ప్రభుత్వం ఏడు రకాల సన్నాలనే పండించాలని రైతులకు సూచిస్తోంది. రైతు వేదికల్లో ఈ నెల 23 నుంచి విత్తన మేళాలను నిర్వహించి, వాటి ప్రయోజనాలపై అన్నదాతలకు విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించింది. వీటికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు (ఎంఎస్?పీ) అదనంగా రూ.500 బోనస్?ను చెల్లించాలని భావిస్తోంది.

ఆ 7 రకాలు ఇవే :

తెలంగాణ సోన రకం (ఆర్ఎన్ఆర్-15048) : పంట కాలం వ్యవధి 120నుంచి 125రోజులు ఉంటుంది. ఇవి బ్లాస్ట్ వ్యధిని తట్టుకోగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. హెడ్ రైస్ రికవరీ 67 శాతంపైనే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సాంబ మసూరి రకం (బీపీటీ-5204) : ఈ పంట కాలపరిమితి 145 నుంచి 150 రోజులు ఉంటుంది. సుగంధబరితమైన ధాన్యం గింజ. ఎగుమతులకు అనుకూలంగా ఉంటుంది.

కేఎన్ఎం (1638) : కేఎన్?ఎం పంట కాలపరిమితి 125 నుంచి 130 రోజులు ఉంటుంది. వ్యాధులను తట్టుకొనగలిగే శక్తి ఉంటుంది.

హెచ్ఎంటీ సోన : ఈ పంట కాలపరిమితి 135 నుంచి 145 రోజులు ఉంటుంది. సూపర్ ఫైన్ రకం తెల్లని గింజ. అద్భుతమైన రుచి. మార్కెట్‌లో ఈ రకం ధాన్యానికి మంచి డిమాండ్ ఉంది.

జైశ్రీరాం : ఈ రకం పంట కాలపరిమితి 125 నుంచి 130 రోజులు. అధిక దిగుబడినిస్తుంది. వర్షాకాలం, యాసంగి సీజన్‌లో సాగుకు అనుకూలం.

వీజీఎల్-44 : వీజీఎల్ పంట కాలవ్యవధి 130 నుంచి 145 రోజులు ఉంటుంది. స్థిరమైన దిగుబడి. అన్నిరకాల నేలలకు అనుకూలం.

కేఎన్ఎం (7715) : ఈ పంట కాలపరిమితి 125 నుంచి 130 రోజులు. సూపర్ ఫైన్ రకం. మార్కెట్‌లో వీటిని మంచి డిమాండ్ ఉంది. సాగులోనూ స్థిరత్వం ఉంటుంది.

సన్నాలకే పెద్దపీట : ఎల్‌నినో నేపథ్యంలో క్రయవిక్రయాలు, ఎగుమతులు, వినియోగ అవసరాల నిమిత్తం తెలంగాణ రాష్ట్రంలో వరి సాగులో సన్నాలకే పెద్దపీట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వానాకాలం సీజన్‌లో 1.34 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని వ్యవసాయశాఖ భావించగా ఇందులో 69 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని ప్రాథమికంగా అంచనా వేసింది. వాటిల్లో 7 సన్న రకాలనే 38.19 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ 7 రకాలే గత సీజన్‌లో 27.88 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. నిరుటి కంటే 10.31 లక్షల పెంచి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. బోనస్ వర్తింపు, సాగు విస్తీర్ణం పెంపుదల, పంపిణీ, సబ్సిడీ, విత్తనాల లభ్యత, తదితర అంశాలను వ్యవసాయ శాఖ మంత్రిమండలి ఆమోదానికి సమర్పించింది. ముందు పూర్తి ధర చెల్లించాలి : రైతన్నలు కొనుగోలు చేసిన విత్తనాలకు ముందుగా పూర్తి ధరను చెల్లించాల్సి ఉంటుంది. పంట కాలం ముగిసేంత వరకు బిల్లును భద్రపరచుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈవో) ఆ రైతు పొలాన్ని సందర్శించి, కొనుగోలు చేసినటువంటి విత్తనాలనే పంట సాగుకు ఉపయోగించారని ధ్రువీకరిస్తారు. అప్పుడు విత్తన సబ్సిడీ రైతుల అకౌంట్లలో పడుతుంది.

## నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

-మొదటిపేజీ తరువాయి
కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

## స్థానికతపై ద్వంద్వ విధానం తగదు..



**హైదరాబాద్** : ఉద్యోగ నియామకాల్లో అభ్యర్థుల స్థానికత నిర్ధారణ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అమలు చేస్తున్న విధానాన్ని హైకోర్టు తప్పుపట్టింది. టీజీపీఎస్సీ ద్వంద్వ విధానాన్ని అమలు చేస్తున్నదని తేల్చింది. ఒక సందర్భంలో అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో చదువలేదన్న కారణంతో అభ్యర్థిని స్థానికుడిగా గుర్తించలేదని, మరో సందర్భంలో 1 నుంచి 7వ తరగతి వరకు తెలంగాణ వెలుపల చదివారనే కారణంతో స్థానికతను నిరాకరించిందని పేర్కొంటూ.. ఇది సరైన విధానం కాదని స్పష్టం చేసింది. స్థానికత నిర్ధారణకు చట్టబద్ధంగా నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించడంలో టీజీపీఎస్సీ విఫలమైందని ఆక్షేపించింది. రాష్ట్రపతి ఉత్తర్వులు-2018లోని పేరా-7లో పేర్కొన్న నిబంధనలను విడివిడిగా కాకుండా సమగ్రంగా చదువాలని, వాటికి సంబంధించిన వ్యాఖ్యానాలను కూడా పరిగణనలోకి తీసుకుని సమిష్టిగా అమలు చేయాలని పేర్కొన్నది. స్థానికత విషయంలో రాజ్యాంగబద్ధ సంస్థగా టీజీపీఎస్సీ స్థిరమైన, ఒకే తరహా ప్రమాణాలను పాటించాలని ఆదేశించింది. 2022 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) నియామకాల వ్యవహారంలో పీ నిశాంత్ అనే అభ్యర్థిని స్థానికుడిగా పరిగణించాలన్న సింగిల్ జడ్జి తీర్పుపై టీజీపీఎస్సీ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ పీ శ్యాంకోశీ, జస్టిస్ నందికొండ నర్సింగరావు ధర్మాసనం తీర్పు వెలువరించింది.

## వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తాం



-మొదటిపేజీ తరువాయి
మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఆయనతో దాదాపు 20 నిమిషాల పాటు పలు అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించిన రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామని రక్షణ మంత్రి హామీ ఇచ్చారు. వాయుసేన టెర్మినల్‌తోపాటు కార్గో, హ్యాంగర్, ఎమ్ఆర్‌వో సౌకర్యాలు కల్పించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హ్యాంగర్స్ ఏర్పాటుకు ఆదిలాబాద్ విమానాశ్రయం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దేవరకద్ర సమీపంలో డీఆర్‌డీవో ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని ఆయన కోరారు.

## సంపాదకీయం

# విరాళాల వివాదం

అయోధ్య వేర్వేరు సందర్భాల్లో దేశ విదేశాల దృష్టిని ఆకర్షించింది. అయితే ఈసారి కారణం ఆలయ ఉద్యమం, దాని వైభవం లేదా భక్తుల రద్దీ కాదు.శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ పనితీరు, ఆలయ విరాళాల చుట్టూ తలెత్తుతున్న తీవ్ర అవకతవకల ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ రామ్ జన్మభూమి ట్రస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు.ట్రస్ట్ కళ్లముందే ఆలయ విరాళాలు, కానుకల లెక్కల్లో పెద్ద ఎత్తున తేడాలు జరిగాయని, రామాలయ కానుకల నుంచి కోట్ల రూపాయలు మాయమయ్యాయని ఆయన ఆరోపిస్తున్నారు.ఆయనతో పాటు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలతో పాటు స్థానిక మాజీ కరసేవకుడు సంతోష్ దూబే, బీజేపీ నాయకుడు డాక్టర్ రజనీశ్ సింగ్ తదితరులు ఈ అవకతవకలను ప్రస్తావిస్తూ జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రస్తుతం ఈ ఆరోపణలపై విచారణ సాగిస్తోంది. అయితే, ఈలోగా అయోధ్య స్థానికులు, ఇక్కడికి వచ్చే భక్తులలో తీవ్ర నిరాశ, ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తున్నాయి.కోట్లమంది నమ్మకం, త్యాగాల ఫలితంగా నిర్మితమైన ఆలయం చుట్టూ ఇలాంటి ఆర్థిక ఆరోపణలు రావడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీన్ని అయోధ్యకు మచ్చ తెచ్చే అంశంగా భావిస్తే, మరికొందరు పారదర్శకత కోసం విచారణ అవసరమని అంటున్నారు.ఈ వివాదాలన్నింటికీ కేంద్ర బిందువుగా మారిన శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో జనరల్ సెక్రటరీ, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడైన చంపత్ రాయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.2020 ఫిబ్రవరిలో అయోధ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత, న్యాయస్థానం ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. 15 మంది సభ్యులతో కూడిన ఈ ట్రస్ట్‌లో అధ్యక్షుడిగా మహంత్ నృత్య గోపాల్ దాస్, కోశాధికారిగా స్వామి గోవింద్ దేవ్ గిరి, సీనియర్ న్యాయవాది కె. పరాశరన్, డాక్టర్ అనిల్ మిశ్రా, కామేశ్వర్ చౌపాల్, మహంత్ దినేంద్ర దాస్ సహా పలువురు మత, సామాజిక ప్రతినిధులు ఉన్నారు.ట్రస్ట్ జనరల్ సెక్రటరీగా ఉన్న చంపత్ రాయ్.. దీని రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించే అత్యంత కీలకమైన అధికారి. ఆలయ నిర్మాణ ప్రాజెక్టు, విరాళాలు–కానుకల నిర్వహణ, అధికారిక సంప్రదింపుల బాధ్యత ఆయనపైనే ఉండటంతో మీడియా ప్రతినిధులు ఆయన సమాధానం కోసం ప్రయత్నిస్తున్నారు.ఇటీవల విడుదల చేసిన ఒక వీడియోలో చంపత్ రాయ్ ఈ ఆరోపణలను ఖండించారు.“ శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రం తన వివిధ పనులకు సంబంధించి సమయానుసారం ఆడిట్ నిర్వహిస్తూనే ఉంటుంది. హుండీ కౌంటింగ్ రూమ్ ఆడిటింగ్‌ను రామాలయ తీర్థ క్షేత్ర ట్రస్టీలు, కార్యకర్తలు, స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు కలిసి చేస్తారు. ఈ ప్రక్రియ చాలా రోజుల పాటు సాగుతుంది. ప్రస్తుతం ఆ పనే జరుగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి తప్పులూ మా దృష్టికి రాలేదు” అన్నారు.చంపత్ రాయ్‌ను సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ ఎలాంటి స్పందనా రాలేదు. ఆయన సాధారణంగా అయోధ్యలోని కరసేవక్ పురంలో నివసిస్తుంటారు. కానీ, మేం అక్కడికి వెళ్లినప్పుడు.. గత ఏడెనిమిది రోజులుగా, అంటే సిట్ దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి ఆయన ఆలయ ప్రాంగణంలోనే ఉంటున్నారని విశ్వహిందూ పరిషత్ సభ్యుడొకరు మాకు తెలిపారు.అయోధ్యలోని స్థానికులు, వ్యాపారులు, సంత్–మహంత్‌లు లేదా రామాలయంతో సంబంధం ఉన్న సామాజిక, మతపరమైన సంస్థల ప్రతినిధులు.. ఇలా వరితో మాట్లాడినా, వారిలో చాలామంది తాజా వివాదం విని తామేమీ ఆశ్చర్యపోలేదని చెప్పారు.గత కొన్నేళ్లుగా ఆలయం, ట్రస్ట్‌కు సంబంధించి రకరకాల వార్తలు, చర్చలు ఎప్పటికప్పుడు బయటకు వస్తూనే ఉన్నాయని, అందుకే ఈ ప్రశ్నలు తలెత్తడం తమకు కొత్తేమీ కాదని కొందరు అభిప్రాయపడ్డారు.అయితే చంపత్ రాయ్ పాత్రపై అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. అవకతవకల్లో చంపత్ రాయ్ వ్యక్తిగత ప్రమేయం ఉండే అవకాశం లేదని ఆయన మద్దతుదారులు నమ్ముతున్నారు.మరోవైపు, విమర్శకులు మాత్రం ఆయనకు తెలియకుండా ఇంత పెద్ద స్థాయిలో పొరపాట్లు జరగడం అసాధ్యమని వాదిస్తున్నారు. వ్యక్తిగత నిజాయితీ ఎలా ఉన్నా, సంస్థలో జరిగే వాటికి ఆయనే జవాబుదారీ వహించాలని స్పష్టం చేస్తున్నారు.ట్రస్ట్‌పై ఇలాంటి ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2021లో అయోధ్యలో కొనుగోలు చేసిన ఒక భూమికి సంబంధించి ట్రస్ట్‌పై ఆరోపణలు వచ్చాయి.ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు దీనిపై స్పందిస్తూ.. ‘ఒక వ్యక్తి రెండు కోట్ల రూపాయలకు కొన్న భూమిని, ఆ ఒప్పందం జరిగిన కొద్ది నిమిషాలకే ట్రస్ట్ 18.5 కోట్ల రూపాయలు చెల్లించి కొనుగోలు చేసింది’ అని ఆరోపించారు.ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్‌తో పాటు పలు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ విషయంలో పారదర్శకత ఉండాలని కోరాయి.అయితే, చంపత్ రాయ్, ట్రస్ట్ ఈ ఆరోపణలను తిరస్కరించారు. భూమి కొనుగోళ్లన్నీ పారదర్శకంగా జరిగాయని, చెల్లింపులన్నీ బ్యాంకింగ్ మార్గాల ద్వారానే చేశామని, మార్కెట్ ధర కంటే తక్కువకే ఆ భూమిని ట్రస్ట్ కొనుగోలు చేసిందని స్పష్టం చేశారు.ఈ ఆరోపణలు ‘తప్పుదోవ పట్టించేవిగా, ‘రాజకీయ దుర్బుద్ధితో కూడినవిగా’ ఉన్నాయని చంపత్ రాయ్ కొట్టిపారేశారు.కానీ, రాజకీయ పార్టీలు ఇప్పుడు మరోసారి ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి. 2021లో కూడా ఈ ఆరోపణలపై విచారణ జరిగిందని, అయితే దాని వల్ల ఏమీ తేలలేదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు, అయోధ్య మాజీ ఎమ్మెల్యే పవన్ పాండే అంటున్నారు.ఆ విచారణ ఎలాంటిది, ఎవరు చేశారు, దాని వల్ల తేలిందేమిటి అనే విషయాలపై ఇప్పటివరకు ఎలాంటి కచ్చితమైన సమాచారం లభించలేదు.

# నడకదారి ఇక పౌరుల హక్కు


నగరాలు, పట్టణాలు, పల్లెటూళ్లన్న తేడా లేకుండా ఇకపై ప్రతి రహదారికీ పాదచారులు నడవటానికి వీలుగా ఫుట్‌పాత్‌లు ఉండి తీరాలనీ, ఇందుకు సంబంధించి ఒక చట్టం తీసుకురావాలనీ సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం ఇచ్చిన ఆదేశం పౌరులకు ఉపశమనం కలిగిస్తుంది. ఈ తీర్పు ప్రాముఖ్యతేమంటే... జీవించే హక్కుకు పూచీపడుతున్న రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని, దాంతోపాటు దేశంలో ఎక్కడికైనా వెళ్లే, స్థిరపడే, కలుసుకునే స్వేచ్ఛను వాగ్దానంచేసే అధికరణం 19(1) (ఎ), (బి), (సి), (డి)లను మరింత విస్తృతీకరించటం. దీని పర్యవసానంగా రోడ్లపక్కన ఫుట్‌పాత్‌లుండటం ఇకపై పౌరుల ప్రాథమిక హక్కుల్లో ఒకటవుతుంది. అయితే ఈ ఆదేశాలిచ్చే ముందు అసలు ఎన్ని నగరాల్లో, పట్టణాల్లో, గ్రామాల్లో ఫుట్‌పాత్‌లున్నాయో... వాటిల్లో ఎన్ని పనికొచ్చే విధంగా ఉన్నాయో గణాంకాలివ్వాలని ధర్మాసనం రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతా లను ఆదేశించాల్సింది. బహుశా అలాంటి ఆదేశం ఇస్తే దీర్ఘకాలం ఎదురుచూపులు చూడటం తప్ప ఫలితం ఉండబోదని న్యాయమూర్తులు భావించి ఉంటారు. న్యాయ స్థానాలు అడిగినప్పుడు ప్రభుత్వాలు తగిన సమాచారం ఇవ్వకపోవటం, వాయిదాలు కోరటం పర్యవసానంగా దేశంలో చాలా కేసులు పెండింగ్‌లో పడుతున్నాయి. వాస్తవానికి కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రహదారుల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ఉన్న ఫుట్‌పాత్‌ల సంఖ్యను క్రోడీకరించినట్టు లేదు. ఫుట్‌పాత్‌ల నిర్మాణం, నిర్వహణ సాధారణంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నిర్వహణలో ఉంటాయి. కేంద్రం తల్చుకుంటే ఈ వివరాలు సేకరించి జాతీయ స్థాయి డేటా రూపొందించగలదు. కానీ ఆ అవసరం ఉందని భావించాలి గదా! ఫుట్‌పాత్‌లు అనేవి మన దేశంలో బ్రహ్మపదార్థం లాంటివి. రోడ్డుపక్కన ఎక్కడో ఒకచోట ఇటుక, సిమెంట్, టైల్స్ శిథిలాలుంటే ఒకప్పుడు ఇక్కడ ఫుట్‌పాత్ ఉండేదని అను కోవటం తప్ప చాలాచోట్ల వాటి జాడ కనబడదు. నగరాలూ, పట్టణాల్లో రోడ్డెక్కిన పాదచారి క్షేమంగా ఇంటికి తిరిగి వెళ్లటం కోసం దారిలో గోతులు, రాళ్లురప్పలూ ఉన్నాయేమో జాగ్రత్తగా చూసుకుంటూ నడవక తప్పని స్థితి. వీటి సంగతలావుంచి ట్రాఫిక్ రద్దీ సమయాల్లో ద్విచక్రవాహనదారులు అసహనంతో



ఆ నడకదారులను సైతం కాజేస్తారు.
ఇక చిన్నా చితకా వ్యాపారాలు చేసుకునేవారు సరేసరి. హైదరాబాద్‌లో మెట్రో రైల్ వచ్చాక స్టేషన్లకు అటూ ఇటూ ఫుట్‌పాత్‌లపై రెస్టారెంట్లు వెలిసి పాదచారుల్ని సవాలు చేస్తున్నాయి. తోపుడు బండి లేదా సైకిళ్లపై వ్యాపారాలు చేసుకునేవారిని అప్పుడప్పుడు ట్రాఫిక్ పోలీసులు అదిలించటం కనబడుతుంది. కానీ మెట్రో స్టేషన్ల దగ్గరుండే రెస్టారెంట్ల జోలికి ఎవరూ వెళ్లిన దాఖలా లేదు. ఇక దేశంలోని ఆరు లక్షల గ్రామాల్లో ఫుట్‌పాత్‌ల సదుపాయంగల ఊళ్లు కనీసం వందల సంఖ్యలోనైనా ఉంటాయా అన్నది సందేహమే. వాటి సంగతలావుంచి దేశ రాజధాని నగరంలో 44 శాతం రోడ్లకు ఫుట్‌పాత్‌లు లేవని ఆమధ్య ఢిల్లీ ఐఐటీ నివేదిక తెలిపింది. ఉన్నచోటైనా దాదాపు 28 శాతం మాత్రమే ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) నిబంధనలకు అనుగుణమైనవని ఆ నివేదిక తేల్చిచెప్పింది. ఈ తీర్పు వెలువరించటానికి దారితీసిన కేసు విషాదకరమైనది. అయిదేళ్ల బాలుడిని అతని తండ్రి పాఠశాల సమీపంలో దించి వెళ్తుండగా హఠాత్తుగా వచ్చిన ట్యాంకర్ ఆ బాలుడిపైకి దూసుకెళ్లి ప్రాణాలు తీసింది. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వాలు కదిలితే ఇలాంటి విషాదాలను నివారించవచ్చు. అయితే బాధాకరమైన విషయమేమంటే... ఈ హక్కు అమల్లోకి రావాలంటే పౌరులు నెరవేర్చాల్సిన విధులు చాలా ఉంటాయి. ఫలానాచోట ఫుట్‌పాత్ లేదని సంబంధిత అధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు చేసి, ఈ తీర్పును ఉటంకించాలి. అటు తర్వాత దాని సంగతేమైందో కనుక్కోవాలి. అవసరమైతే ఆర్టీఐని ఆశ్రయించాలి. అటు తర్వాత ఫుట్‌పాత్ లేనిచోట పరిస్థితిని తెలిపే ఫొటోతో హైకోర్టులో పిల్ దాఖలు చేయాలి. అందులో తీర్పు వెలువడటానికి దీర్ఘకాలం వేచిచూడాలి. విద్యాహక్కు చట్టం, పనిచేసే హక్కు చట్టంవంటివి ఆచరణలో ఎలా నీరుగారుతున్నాయో కనబడుతూనే ఉంది. ఏ హక్కు అమలు కావాలన్నా పౌరులంతా ఒక్కటై ఉద్యమించటమే, ప్రభుత్వాలపై ఒత్తిళ్లు తీసుకురావటమే మార్గం.

# అరణ్యరోదన

మన ప్రాచీనులు అడవులను దైవంగా ఆరాధించేవారు. అడవులను జీవజాలానికి ప్రాణాధారంగా చూసేవారు. అడవులను పవిత్ర తపోభూములుగా పరిగణించేవారు. అరణ్యాల ప్రస్తావన లేని పురాణేతిహాసాలేవీ మనకు లేవు. ఉద్యాన వర్ణన లేని ప్రబంధాలేవీ మనకు లేవు. అరణ్యకాండ లేని రామాయణాన్ని, అరణ్యపర్వం లేని మహాభారతాన్ని మనం ఊహించుకోలేం. ప్రాచీన వేదర్షులు సైతం వన ప్రాశస్త్యాన్ని ప్రస్తుతించారు. ‘అంజనగంధిం సురభిం బహున్నామ కృషీవలామ్/ ప్రాహం మృగాణాం మాతరమరణ్యానిమశంసిషమ్’ అని ఋగ్వేదంలోని ‘అరణ్యాని సూక్తం’ చెబుతోంది. అంటే, అంజనంలా సుగంధభరితమైనది, అనేక జంతువులకు తల్లివంటిది అయిన అరణ్యదేవతను స్తుతిస్తున్నాను అని అర్థం.
‘దశకూప సమా వాపీ దశవాపీ సమో హ్రదః/ దశహ్రద సమః పుత్రో దశపుత్ర సమో ద్రుమః’ అని ‘పద్మపురాణం’ చెబుతోంది. అంటే, పది బావులకు సమానం ఒక చెరువు, పది చెరువులకు సమానం ఒక సరస్సు, పది సరస్సులకు సమానం ఒక పుత్రుడు, పదిమంది పుత్రులకు సమానం ఒక వృక్షం అని అర్థం. ‘అశ్వత్థమేకం పిచుమందమేకం న్యగ్రోధమేకం దశతింత్రిణీకం/ కపిత్థ బిల్వామలకత్రయాంచ పంచామ్రవాపీ నరకం న వశ్యేత్’-- రావిచెట్టు, వేపచెట్టు, మర్రిచెట్టు ఒక్కొక్కటి చొప్పున; పది చింతచెట్లు; మూడేసి వెలగచెట్లు, మారేడుచెట్లు, ఉసిరిచెట్లు; ఐదు మామిడిచెట్లు పెంచినవాడికి నరకం ఉండదు అని స్కాందపురాణం చెబుతోంది. వేద పురాణేతిహాసాలను గమనిస్తే, ప్రాచీనులు చెట్టు చేమలతో నిండిన అడవులకు ఎంతటి విలువనిచ్చేవారో అర్థమవుతుంది. ప్రాచీనకాలంలో రాజులు కూడా అడవుల సంరక్షణను బాధ్యతగా భావించేవారు. ‘ద్రవ్యవనకర్మాంతాశ్చ ప్రయోజయేత్/ ద్రవ్యవనచ్ఛిదాం చ దండం కారయేత్’ అని కౌటిల్యుడి అర్థశాస్త్రం చెబుతోంది. అంటే, అటవీ సంపదనకు సక్రమంగా వినియోగించాలి. అక్రమంగా అడవులను నరికివేసేవారిని శిక్షించాలి అని అర్థం. కౌటిల్యుడు ‘అర్థశాస్త్రం’లో అభయవనాలు, హస్తివనాలు వంటి రకరకాల అడవుల సంరక్షణ కోసం పాటించవలసిన విధి విధానాలను వివరంగా చెప్పాడు. దాదాపు పదివేల ఏళ్ల కిందట-- నాగరికతలు మొదలైన కాలంలో భూమ్మీద దాదాపు అరవై



శాతం అడవులే ఉండేవి. పద్దెనిమిదో శతాబ్దిలో పారిశ్రామిక విప్లవం మొదలయ్యేంత వరకు అడవుల పరిమాణం దాదాపు ఇదే స్థాయిలో ఉండేది. పారిశ్రామిక విప్లవం నాటి నుంచి అడవులు క్షీణించడం మొదలైంది. ఆధునికత, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ అడవుల విస్తీర్ణాన్ని కబళించడం మొదలైంది. ఇప్పుడు భూమ్మీద దాదాపు ముప్పయి శాతం అడవులు మాత్రమే మిగిలి ఉన్నాయి. పారిశ్రామిక విప్లవం నాటి నుంచి నేటి వరకు భూమ్మీద ఉన్న అడవుల విస్తీర్ణం సగానికి సగం క్షీణించి పోయింది. ప్రస్తుత శతాబ్ది మొదలైన తొలి ఇరవై ఏళ్లలోనే ఏకంగా ఆరు శాతం మేరకు అడవులు తరిగిపోయాయి. మన దేశంలోనైతే, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు సగానికి సగం అడవులు అంతరించిపోయాయి. ఒకవైపు అడవుల విస్తీర్ణం తరిగిపోతుంటే, మరోవైపు మరుభూముల విస్తీర్ణం పెరుగుతోంది. గడచిన శతాబ్ద కాలంలో సహారా ఎడారి విస్తీర్ణం పది శాతం పెరిగింది. ‘ఒక అడవిని సృష్టించడం కంటే ఒక ఎడారిని సృష్టించడం తేలిక కావడమే విచారకరం’ అన్నాడు ఇంగ్లిష్ శాస్త్రవేత్త, పర్యావరణవేత్త జేమ్స్ లవ్‌లాక్. పనులు తేలిక చేసుకోవడానికి అలవాటుపడ్డ ఆధునికులు అడవులను సృష్టించే శ్రమ తీసుకోకుండా, తేలికగా ఎడారులను సృష్టించుకుంటున్నారు. అడవులు పుడమికి ఊపిరితిత్తులు. ఆధునిక మానవులు వాటికి తూట్లు పొడుస్తున్నారు. పర్యవసానంగా భూతాపం పెరిగి, మనుషులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మనుషులకు ఊపిరాడాలన్నా, సకాలంలో వానలు కురిసి పంటలు పండాలన్నా, ఇంకా ఈ భూమ్మీద మానవాళి మరిన్ని కాలాలపాటు మనుగడ సాగించాలన్నా, మనం ఇప్పటికైనా మేలుకొని అడవులను కాపాడుకోవాలి. అడవులన్నీ నశించాక మానవాళి చేసే ఆక్రందనలు అరణ్యరోదనలే అవుతాయి.

## మూడు సముద్రాలపై భారత్ పట్టు

**ముంబై :** ఆకాశం, నీరు, నిప్పు.. ఈ మూడింటి ఆధారంగానే మనిషి మనుగడ సాగుతూ ఉంటుంది. వీటి మీద పట్టు చిక్కితే మనిషి జీవితం సులభం అవుతుంది. మనిషి అంటే కేవలం ఒకరు మాత్రమే కాదు.. ఈ యావత్ ప్రపంచం. నిప్పు మీద పట్టును కాస్త పక్కన పెడితే.. గగనం.. సంద్రం మీద పట్టు సాధించిన వారే గొప్పగా మనుగడ సాగిస్తూ ఉంటారు.ప్పటివరకు ప్రపంచంలో అమెరికా.. రష్యా.. చైనా.. ఇంకా కొన్ని దేశాలు గగనతలం మీద పట్టు సాధించాయి.. సముద్రంలో కూడా సత్తా చాటాయి. అందువల్లే ఈ దేశాలకు ప్రపంచం మీద పెత్తనం ఎక్కువగా ఉంటుంది. అవి ఏం చెప్తే అదే చేయాలి. ఎలాంటి ఆదేశాలిస్తే వాటిని పాటించాలి.. అయితే ఇప్పుడు భారత్ వాటి సరసన చేరింది. మరి కొద్ది రోజుల్లో అయితే వాటిని మించిపోతుంది. దీనికి ప్రధాన కారణం దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయాలు.గడచిన కొంతకాలంగా మన దేశ నౌకాదళ వ్యవస్థలోకి 40 యుద్ధ.. సర్వే నౌకలు.. జలాంతర్గాములు వచ్చాయి. ఇంకా 45 తదుపరి దశలో ఉన్నాయి. అంతేకాదు అత్యాధునిక స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ దునగిరి, సర్వే నౌక, ఐఎన్ఎస్ సంషోదక్, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధనౌక ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు నౌకలను ప్రధానమంత్రి ప్రారంభించారు. కోల్ కతా లోని శామ ప్రసాద్ ముఖర్జీ పోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో వీటిని జాతికి అంకితం చేశారు. ఈ మూడు నౌకలు అత్యంత ప్రత్యేకమైనవి. వీటివల్ల మన నౌకాదళం మరింత బలాన్ని పెంచుకుందిఇది అత్యంత పెద్దది. స్టెల్త్ ఫ్రిగేట్ విభాగంలో ఇది బాహుబలి లాగా ఉంటుంది. శత్రువుల రాడార్లు.. సెన్సార్లకు ఏమాత్రం చిక్కదు. పైగా ఇది అత్యాధునిక టెక్నాలజీతో పనిచేస్తూ ఉంటుంది. మన నౌకాదళంలో ఐఎన్ఎస్ నీలగిరికి ప్రత్యేకమైన పేరు ఉంది. ఈ ప్రాజెక్టు 17 ఏ లో భాగంగానే దీనిని నిర్మించారు. ఇందులో బ్రహ్మోస్ మిస్సైల్స్.. మిడిల్ రేంజ్ మిస్సైల్స్.. మల్టీ ఫంక్షన్ సర్వే లైన్స్.. ట్రాక్ గైడెన్స్ రాడార్.. సోనార్ సెన్సార్లు.. ఎలక్ట్రానిక్ వార్ ఫెయిర్ వ్యవస్థలు ఇందులో ఉంటాయి. ఇది ఏకంగా 149 మీటర్ల పొడవు..6670 టన్నుల బరువు ఉంటుంది. ఇది గంటకు 52 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుందిఇది హై అండ్ టెక్నాలజీ తో రూపొందించిన హైడ్రోగ్రాఫిక్ సర్వే నౌక. ఇది పూర్తిగా సముద్ర గర్భాన్ని మ్యాపింగ్ చేస్తూ ఉంటుంది. మహా సముద్రాల లోతును కొలుస్తూ ఉంటుంది. సముద్ర మార్గాలను నిత్యం అన్వేషిస్తూ ఉంటుంది. దీని పొడవు 110 మీటర్లు. బరువు 3400 టన్నులు ఉంటుంది. ఇది గంటకు 18 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణం సాగిస్తూ ఉంటుంది.

# గ్రామీణ అభివృద్ధి స్వయం ఉపాధికి బ్యాంక్ కీలకం

**ప్రారంభోత్సవంలో పాల్గొన్న టాస్క్ సి ఓ ఓ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలంలోని గట్టిప్పలపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ప్రారంభోత్సవశీలోఎంపీ డా. మల్లు రవి మరియు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తో కలిసి పాల్గొన్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, గట్టిప్పలపల్లి గ్రామంలో యూనియన్ బ్యాంక్ శాఖ ఏర్పాటు కావడం శుభపరిణామమని,గ్రామ ప్రజల ఎన్నో సంవత్సరాల కోరిక నెరవేరి,బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావడం ఆనందకర విషయమని తెలిపారు,గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కానున్నాయని, ఇప్పటి వరకు చిన్నచిన్న బ్యాంకింగ్ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి



వచ్చేదని,ఇకపై స్థానికంగానే అన్ని సేవలు అందుబాటులో ఉండడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అన్నారు,యూనియన్ బ్యాంక్ ద్వారా పొదుపు ఖాతాలు,రైతులకు వ్యవసాయ రుణాలు,స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం,డిజిటల్ బ్యాంకింగ్ సేవలు,ఏటీఎం సౌకర్యాలు తదితర ఆధునిక బ్యాంకింగ్ సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు,గ్రామీణ అభివృద్ధి,స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో బ్యాంకుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, గట్టిప్పలపల్లి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, నూతన శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా యూనియన్ బ్యాంక్ యాజమాన్యానికి, అధికారులు మరియు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, నియోజకవర్గ ప్రస్తుత మరియు మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ స్థాయిల నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావు నీ కలిసిన గోలి శ్రీనివాస్ రెడ్డి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

అచ్చంపేట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా

అచ్చంపేట నియోజకవర్గంలో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకావడానికి వెళ్తున్న మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు కి వెల్దండ మండల కేంద్రంలో ఘన స్వాగతం పలికిన తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆయనతో పాటు వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని హరీష్ రావు కి ఘనంగా స్వాగతం పలికారు.

## నూతన గ్రామ పంచాయతీ భవనశీ మంజూరు చేయాలి




**మంత్రి సీతక్కకి వినతి పత్రం అందజేసిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కడ్తాల్ మండలంలోని నూతన ఎంపీడీఓ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మంత్రి నూతన భవన నిర్మాణానికి సానుకూలంగా స్పందించారని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి రషీద్, పసునోజు పురుషోత్తమాచారి, గుద్దటి కిష్టల్, మసిగుండ్ల వెంకటేష్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాదేపల్లి మల్లయ్య,,మరేపల్లి శ్రీనివాస్,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ లైట్లు మంజూరు చేయాలని ఎంపీకి కి వినతి పత్రం అందజేసిన సర్పంచ్



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కడ్తాల మండల కేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయ నూతన భవనం ప్రారంభోత్సవనికి విచ్చేసిన నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువ తో సత్కరించిన లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అలాగే లింగరావుపల్లి మరియు రామకృష్ణపురం గ్రామం లో సోలార్ లైట్ల గురించి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా ఎంపీ మల్లురవి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

## రూపాయి 30 పైసలు డౌన్

**ముంబై:** డాలర్ మారకంలో రూపాయి విలువ 30 పైసలు బలహీనపడి 94.63 వద్ద ముగిసింది. పశ్చిమాసియా శాంతి ఒప్పందంపై నెలకొన్న సందిగ్ధత, డాలర్ బలోపేతం కావడం అంశాలు దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచింది. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం డాలర్ మారకంలో రూపాయి విలువ 94.42 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన రూపాయి, 94.24 -- 94.76 శ్రేణిలో కదలాడింది. “స్వల్పకాలంలో 94.10 స్థాయి వద్ద బలమైన మద్దతు లభించవచ్చు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి చేయూత



**ట్రస్ట్ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మున్సిపాల్టీ లోని 15వ వార్డు కి చెందిన ఈడమోని మహేష్ తండ్రి బచ్చన్న నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం తో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ వెంటనే స్పందించి తన ట్రస్ట్ సహకారంతో సిమెంటు స్టీల్ అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు దారమోని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు ద్వారా పరిసర గ్రామ ప్రజలకు ఎంతో మేలు




**ప్రారంభించిన ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలంలోని గట్టిపడపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంకు శాఖ కార్యాలయాన్ని, ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ, ఎన్నో శతాబ్దాలుగా గ్రామ ప్రజల కోరిక నెరవేరిందని ఆయన అన్నారు. పరిసర గ్రామ సిబ్బందికి, వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలకు ఈ బ్యాంకు ఉపయుక్తంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ, అందరి కృషి తో గ్రామానికి బ్యాంక్ మంజూరు కావడం జరిగింది అని సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో , పుడ్ కమిషన్ సభ్యులు గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ , జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ, కల్వకుర్తి మాజీ మున్సిపాలిటీ చైర్మన్ ఎడ్మ సత్యం,వెల్జాల్ మాజీ ఉపసర్పంచ్ అజీజ్, స్థానిక వాడు సభ్యుడు రేణురెడ్డి, డేవిడ్ ,ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి సితక్కని సన్మానించిన మాజీ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కడ్తాల మండల కేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయ నూతన భవనం ప్రారంభోత్సవనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పంచాయతీ రాజ్ శాఖ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కన్ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువ తో సన్మానించిన తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గుజ్జుల మహేష్ ఈ సందర్బంగా చిపునూశీతల గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

## నేటి నుండి విత్తన మేళా-రైతులకు ఆహ్వానం: వ్యవసాయ అధికారి ప్రభావతి:

**రామడుగు :** రామడుగు మండలంలోని అన్ని రైతువేదికలలో రామడుగు దేశ్రాజుపల్లి వెదిర వెలిచాల రంగసాయి పల్లి గోపాలరావు పేట వేదికలలో ప్రభుత్వ నిర్ణయం మేరకు తేదీ 23 మంగళవారం నుండి తేదీ 30 మంగళవారం వరకు విత్తన మేళా నిర్వహించబడునని వ్యవసాయ అధికారి తెలిపారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోడల్ స్కూల్ లో పాఠ్యపుస్తకాల పంపిణీ



అగ్నిధార న్యూస్మహమ్మదాబాద్/గండిడ్:

మహబూబ్నగర్ జిల్లా గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామంలోని మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెన్నచేడ్ గ్రామ సర్పంచ్ శ్రీ గుర్రాల నవనీత చెన్నయ్య మరియు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫాతిమా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు అందించిన పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యే సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి తమ గ్రామానికి తల్లిదండ్రులకు మరియు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## బొట్లగడ్డ తండా ప్రాథమిక పాఠశాల పున:ప్రారంభం



అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:

మహమ్మదాబాద్ మండలంలోని బొట్లగడ్డ తండా ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి (ఎంఈఓ) రాజు నాయక్, ఎంఎన్ఓ సురేందర్ రెడ్డి హాజరై పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పలు సంక్షేమ పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తండా సర్పంచ్ రాంచందర్, గ్రామ సెక్రటరీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన




అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:

యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన అత్యంత అవసరమని మహమ్మదాబాద్ ఎస్సై శేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మహమ్మదాబాద్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో విద్యార్థి, విద్యార్థినుల కోసం డ్రగ్స్ నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినడంతో పాటు ఆరోగ్యం, కుటుంబ జీవితం మరియు సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలు, ఆరోగ్య సమస్యలు, సామాజిక నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు డ్రగ్స్ నివారణకు సంబంధించిన పలు సందేహాలను అడిగి తెలుసుకోగా, ఎస్సై వాటికి సమగ్ర సమాధానాలు ఇచ్చారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో మత్తు పదార్థాల పట్ల చైతన్యం పెంపొందించడంలో ఉపయోగకరంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## నాప శివ అకాల మరణం బాధాకరం

**కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసిన కౌన్సిలర్ బావాండ్ల మంజుల మధు**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని సిలార్ పల్లి కి చెందిన నాప శివ గత మూడు రోజుల క్రితం ఆకస్మికంగా మరణించడం జరిగింది. స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న 14వ వార్డు కౌన్సిలర్ భవాండ్ల మంజుల మధు మృతుని కుటుంబాని పరామర్శించి 15,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,శివ అకాల మరణం బాధాకరం అని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మనోహర్ రెడ్డి, బాబిదేవ్, రాధాకృష్ణ, మల్లేష్, శేఖర్, అంజయ్య, బాలయ్య పాల్గొన్నారు

# పాలమూరు బిడ్డ అని ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి

మళ్లీ కెసిఆర్ ఏ రావాలి మాజీ మంత్రి హరీష్ రావు తో రైతులు

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని రైతులు మాజీ మంత్రి హరీష్ రావు తో అన్నారు. సోమవారం అచ్చంపేట లో జరిగే కార్యకర్తల సమావేశానికి హైదరాబాద్ నుండి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి తో కలిసి హరీష్ రావు వెళ్తుండగా మార్గమధ్యలో కడ్తాల పట్టణంలో ఉన్న ఆగ్రో ఎరువుల దుకాణం వద్ద రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రైతుబంధు వస్తుందా అని రైతులను అడిగి తెలుసుకోగా రైతుబంధు ఎకరా నుంచి రెండు ఎకరాల వరకే వేయడం జరిగిందని యూరియాకు అష్ట కష్టాలు పడుతున్నామని రైతులు తెలిపారు. యాప్ ద్వారా యూరియా నమోదు వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు హరీష్ రావుతో అన్నారు. పాల బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాడి రైతులు హరీష్ రావుకు



తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డనంటూ రైతులను తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నారని ఆయన అన్నారు.రైతు బంధు బంధు చేశారు. రైతు బీమా భోగసయ్యింది. కెసిఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా, కరెంటు వంటి పథకాలు సక్రమంగా రాష్ట్రంలో అమలు చేయడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలం చెందారని ఆయన ఆరోపించారు. హరీష్ రావు వెంట డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, బీఆర్ ఎస్ నాయకులు జోగు వీరయ్య, సర్పంచ్ గోపాల్, గంప శ్రీనివాసులు, రామకృష్ణ, జగదీశ్వర్, శ్రీకాంత్, అమృతం పాండు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# కడ్తాల్‌లో నూతన మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రారంభం

ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సీతక్క, ఎంపీ మల్లురవి,ఎమ్మెల్యే కసిరెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కడ్తాల్ స్వయం సహాయక మహిళా సంఘాల్లో సభ్యత్వం కలిగి ఉంటే అవసర సమయంలో సంఘం మహిళలకు అండగా నిలుస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని మంత్రి సీతక్క, ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు కేటాయించాలని, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల భవనాల నిర్మాణానికి సహకరించాలని మంత్రిని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం 100 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ. ప్రజాపాలన ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుకు కట్టుబడి ఉందన్నారు.గత ప్రభుత్వాల వైఫల్యాల వల్ల రాష్ట్రం అప్పుల భారంలో చిక్కుకుపోయిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కేటీఆర్ ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం



సరికాదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం సీఎం స్థాయిని కూడా గౌరవించకుండా వ్యాఖ్యలు చేయడం సరికాదని, ప్రజలే తగిన సమయంలో వారికి బుద్ధి చెబుతారని అన్నారు. బీజేపీ నాయకులు ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పిస్తే తెలంగాణ ఎంపీలందరూ సిద్ధంగా ఉన్నారని, అది చేయకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నరు ఎంపీ మల్లురవి అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు కుటుంబ గ్రామ అభివృద్ధితో కీలకపాత్ర పోషిస్తున్నారని ఆమె తెలిపారు మహిళా సంఘాల బలపడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఇప్పటికే మహిళా సంఘాలకు 61 వేల కోట్ల రుణాలు అందించామని చెప్పారు బయోపరిమితి లేకుండా 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు కూడా పెన్షన్ అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సీతక్క తెలిపారు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన పరిపాలన సేవలు అందించేందుకు అవసరమైన ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్,అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు ఆసిఫ్ అలీ,రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి, జెడ్పి సీఈవో సిహెచ్ కృష్ణారెడ్డి, డి ఆర్ డి ఓ శ్రీలత, ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, డిపీఓ సురేష్ మోహన్, ఈ ఈ సుదర్శన్ రెడ్డి, డిప్యూటీ ఈ ఈ శ్రీనివాస్, తాసిల్దార్ జయశ్రీ సిపిడిఓ శాంతి పేట మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, స్థానిక సర్పంచ్ బిక్షపతి,మాజీ మండల అధ్యక్షుడు గుజ్జులా మహేష్,ఎంపీడీవో సుజాత ఏ పి ఓ, లాలయ్య, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# మత్తుకు దూరంగా ఉండాలి






హానికరమైన విషయాలకు ధైర్యంగా "నో" చెప్పాలి. మంచిర్యాల డీసీపీ భూక్య రామిరెడ్డి. పెద్దపల్లి ఏసీపి గజ్జి కృష్ణ యాదవ్.

అగ్నిధారన్యూస్ పెద్దపల్లి: జూన్22

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలలో భాగంగా సోమవారం పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నోబెల్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మోహనరాజా ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి రామీరెడ్డి పెద్దపల్లి ఏసీపి గజ్జి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మత్తు పానీయాలకు వ్యతిరేకంగా పోస్టర్ రిలీజ్ చేశారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు వివరించారు.విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం,పోలీస్ శాఖ విస్తృత చర్యలు చేపడుతున్నాయని తెలిపారు.డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ అరెస్టులు చేస్తున్నప్పటికీ, కొంతమంది యువత తెలిసో తెలియకో వాటి బారిన పడుతున్నారని తెలిపారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల మానసిక సమతుల్యత దెబ్బతిని,కుటుంబ సభ్యులతో పాటు సమాజానికీ ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. సాధారణంగా చిన్న ఆసక్తితో సిగరెట్ లేదా ఇతర మత్తు పదార్థాలను ప్రయత్నించడం ప్రారంభమై,క్రమంగా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ వ్యసనాల కారణంగా మత్తులో కొందరు దొంగతనాలు నేరాలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితానికి అవసరమైన విలువలను బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు యువత తమకు నచ్చని లేదా హానికరమైన విషయాలకు ధైర్యంగా "నో" చెప్పడం నేర్చుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే "నో" చెప్పే అలవాటు పెంపొందితే భవిష్యత్తులో సరైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తులుగా ఎదుగుతారని తెలిపారు. తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలను గమనించినట్లయితే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని, అవసరమైతే డయల్-100కు ఫోన్ చేసి పోలీసులకు తెలపాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతా యని అన్నారు.మంచి పౌరులుగా, బాధ్యతాయుతమైన విద్యార్థులుగా ఎదిగి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజాన్ని కూడా అప్రమత్తం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి రూరల్ ఎస్ఐలు మధుకర్, శ్వేత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ప్రణీత ఉపాధ్యాయులు,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతువేదికలలో విత్తన మేళ



అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండిడ్:

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 23 నుండి 29 వరకు మహమ్మదాబాద్ గండీడ్ వెన్నచేడ్ నంచర్ల రైతు వేదికలలో విత్తన మేళా నిర్వహించబడుతుంది. ఈ విత్తన మేళాలో రైతులకు నాణ్యమైన ధృవీకరించబడిన వరి, పప్పు ధాన్యాలు, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంటాయి. అలాగే నానో యూరియా మరియు నానో డి.ఎ.పి. కూడా విక్రయించబడతాయి.

వరి రైతుల కోసం ప్రభుత్వం బోనస్ ప్రకటించిన 8 రకాలకు సంబంధించిన వరి విత్తనాలు కూడా ఈ మేళాలో అందుబాటులో ఉంచబడతాయి. రైతులు తమకు అవసరమైన విత్తనాలను, వ్యవసాయ ఉత్పాదకాలను రైతు వేదికలలోనే కొనుగోలు చేసి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## మొహరం శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి



అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి.
పండుగ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి.
అవసరమైన చోట మినీ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి.
మొహరం పండుగ ఏర్పాట్ల పై అధికారులతో సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్

అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జూన్-22

సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి మొహరం పండుగ నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొహరం పండుగ సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మొహరం పండుగ సందర్భంగా భక్తులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అవసరమైన ప్రాంతాల్లో మినీ హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మసీదులు, అశుర్ ఖానా పరిసరాల్లో పరిశు భ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. పండుగ రోజుల్లో ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మొహరం పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య, పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ యాదవ్ పెద్దపల్లి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, , మున్సిపల్ కమిషనర్లు, వెంకటేష్, రమేష్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తులు....

జూలై 6 వరకు అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ ... జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.



అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జూన్ -22:

పెద్దపల్లి జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐసీడీఎస్ రామగుండం ప్రాజెక్టులో 4 పోస్టులు, ఐసీడీఎస్ పెద్దపల్లి ప్రాజెక్టులో 17 పోస్టులు, ఐసీడీఎస్ మంథని ప్రాజెక్టులో 43 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో మాత్రమే స్వీకరించబడతాయని తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని, జూలై 6, 2026 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని వెల్లడించారు.

అభ్యర్థులు సంబంధిత అంగన్‌వాడీ కేంద్రం ఉన్న గ్రామం లేదా మున్సిపల్ వార్డుకు చెందిన స్థానిక మహిళలై ఉండాలని, ఇంటర్‌మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. 01-07-2026 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయబడతాయని పేర్కొన్నారు. వినికిడి యంత్రాల సహాయంతో వినగలిగే హెచ్‌హెచ్ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.దరఖాస్తుతో పాటు ఎస్ఎస్‌సీ మెమో (వయస్సు ధృవీకరణ పత్రం), జనన ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ పత్రం, ఇంటర్‌మీడియట్ సర్టిఫికేట్, దివ్యాంగుల సదరం సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం, అనాథ ధృవీకరణ పత్రం తదితర పత్రాలను జతపరచాలని సూచించారు. ప్రజావాణి లేదా కార్యాలయాల్లో నేరుగా సమర్పించిన దరఖాస్తులు స్వీకరించబడవని, ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే ఈ నియామక ప్రక్రియను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపైన చర్యలు తీసుకోవాలి..

**ఆల్ ఇండియా స్టూడెంట్స్, జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్...**

**జమ్మికుంట :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు జీవో నెంబర్ 42 కి విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి వారి ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని, ఆల్ ఇండియా స్టూడెంట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్, ఈ సందర్భంగా మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు.

# ఆర్జీలు సత్వరమే పరిష్కరించాలి

**ప్రజావాణిలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జూన్ 22:**



అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి, డిఆర్ఓ రాజేశ్వరి లతో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన నోముల రాజేశ్వర్ రెడ్డి తమ ఇంటిని ఆన్లైన్లో నమోదు చేసేందుకు దరఖాస్తు చేసుకోగా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమ పేరు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపిడిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు రామగుండం గౌతమినగర్ కు చెందిన డి కాశయ్య మల్కాపురం గ్రామంలో సర్వేనెంబర్ 125/3 లో గల 20 ఎకరాల భూమి గతంలో ఎక్స్ సర్వీస్ మెన్ కోసం 1981 లో కేటాయించడం జరిగిందని , దీనిలో ఎటువంటి ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అనుమతి ఇవ్వరాదని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డీవో పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన వేముల నర్సమ్మ సర్వే నెంబర్ 474/1 లో ఎకరం భూమి ఉందని , తన భూమిని కొంతమంది ఆక్రమించాలని చూస్తున్నారని, తన భూమి జోలికి ఎవరు రాకుండా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ఓదెల కు రాస్తూ నిబంధనలు ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరిఖని సూర్య నగర్ కు చెందిన ఆర్. రాధ తన కుమారుడికి ప్రభుత్వ విద్యా సంస్థలోని హాస్టల్లో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు ఇసుక క్వారీ నిలిపివేయాలి

**గ్రీవెన్స్ డేలో ప్రజా పోరాట సమితి వినతి**

**ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి**

**అగ్నిధార న్యూస్ ,(ములుగు):**



వాజేడు మండలంలోని ధర్మవరం--చెరుకూరు రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు ధర్మవరం గ్రామంలో కొనసాగుతున్న ఇసుక క్వారీ కార్యకలాపాలను నిలిపివేయాలని ప్రజా పోరాట సమితి ప్రతినిధులు గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా పోరాట సమితి అధ్యక్షుడు ముత్తెబోయిన మహేందర్ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా ఇసుక లారీల రాకపోకల కారణంగా ధర్మవరం--చెరుకూరు రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారిందన్నారు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ పలువురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సేవల కోసం వచ్చే అంబులెన్సులు సైతం సకాలంలో వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు.ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించకుండా రోడ్డు నిర్మాణాన్ని విస్మరించి ఇసుక క్వారీలకు అనుమతులు ఇవ్వడం బాధాకరమని విమర్శించారు. రహదారి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, అప్పటి వరకు ఇసుక క్వారీని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి వాజేడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మినరల్ వాటర్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రహరీ గోడలు లేక జంతువులు పాఠశాలల్లోకి ప్రవేశిస్తున్నాయని, శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి సురక్షిత వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని కోరారు.వినతిపై స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గార రవికుమార్, గగ్గూరి నాగేంద్రబాబు, గ్రామ ప్రజలు, ప్రజా పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీవో వెంకన్న మృతి అత్యంత విషాదకరం

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**: సమత సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్ని ధార న్యూస్,(భూపాలపల్లి):**




భూపాలపల్లి జిల్లాలో విధి నిర్వహణలో ఉన్న ఆర్టీవో వెంకన్న బొగ్గు లారీ ఢీకొని మృతి చెందడం అత్యంత విషాదకరమని సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ పేర్కొన్నారు.ఈ ఘటనపై ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు.అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో జరిగిన ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మృతుడు వెంకన్న కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీవో అధికారులు, సిబ్బందికి తగిన భద్రతా ఏర్పాట్లు కల్పించి, ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.మృతుడు వెంకన్న ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని డా. మార్షల్ దుర్గం నగేష్ తెలిపారు.సమాజంలో చట్టాన్ని అమలు చేసే అధికారుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## చిన్నారులకు నోట్‌బుక్స్, విద్యా సామగ్రి పంపిణీ

**మోదీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**: బీజేపీ నాయకులు**

**అగ్నిధార న్యూస్,(రామగుండం) :**

ప్రధాని నరేంద్ర మోదీ మూడు పర్యాయాల (12 ఏళ్ల) పాలనలో అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి సూచనల మేరకు జనగామ మండల పరిధిలోని 7వ డివిజన్ పవర్‌హౌస్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో సోమవారం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ యోజన, పీఎం ఆవాస్ యోజన, జనధన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛ భారత్ మిషన్, వందే భారత్, ఉచిత రేషన్ బియ్యం వంటి సంక్షేమ పథకాలు దేశ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించడం ద్వారా విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తడగొండ నర్సయ్య, మండల అధ్యక్షుడు గుండబోయిన భూమయ్య, బియ్యాల మహేందర్, బండారి శ్యామ్, కొట్టే నరేష్, జక్కన బాలు, శిలారపు కల్యాణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొగ్గు లారీ ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

**మృతుడు వెంకన్న కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి**

**: కల్వకుంట్ల కవిత**

**అగ్నిధార న్యూస్ ,(హైదరాబాద్):**




భూపాలపల్లి జిల్లాలో సోమవారం జరిగిన బొగ్గు లారీ ప్రమాదంలో ఆర్టీవో వెంకన్న మృతి చెందడం అత్యంత విషాదకరమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే మృతుడి కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు.ఈ మేరకు సోమవారం ఆమె సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. భూపాలపల్లిలో జరిగిన ఈ ప్రమాదంపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ప్రమాదానికి దారితీసిన కారణాలపై పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ధరణి పవర్ స్టేషన్ (జెన్‌కో)కు తాడిచెర్ల కోల్ మైన్ నుంచి ప్రతిరోజూ సుమారు 13 వేల టన్నుల బొగ్గు రోడ్డు మార్గంలో తరలిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఇంత భారీ స్థాయిలో బొగ్గు రవాణాను రోడ్డు మార్గంలో కాకుండా రైల్వే మార్గంలో ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. భారీ బొగ్గు లారీల రాకపోకల కారణంగా ప్రజల ప్రాణ భద్రత ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు రవాణా కోసం రోడ్లను వినియోగించడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుం టున్నాయని, అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ధరణి పవర్ స్టేషన్‌కు బొగ్గు రవాణాను రైల్వే మార్గంలోనే నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

## టీసీ పేరుతో ప్రైవేట్ విద్యాసంస్థల దందా

**అక్రమ వసూళ్లు ఆపకపోతే ఆందోళనలు తప్పవు**

**: టీఎన్ఎస్ఎఫ్**

**అగ్ని ధార న్యూస్,( పెద్దపల్లి):**




ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు విద్యార్థుల నుంచి బదిలీ ధ్రువీకరణ పత్రం (టీసీ) పేరుతో అక్రమంగా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నాయని టీఎన్ఎస్ఎఫ్ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు ఎండి వాజీద్ ఆరోపించారు. విద్యార్థులు ఏడాది పొడవునా నిర్ణీత ఫీజులు చెల్లించి చదువు పూర్తిచేసుకున్న తర్వాత టీసీ తీసుకోవడం వారి హక్కు అయినప్పటికీ, రూ.2,000 నుంచి రూ.2,500 వరకు వసూలు చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. టీసీ జారీకి ఎలాంటి రుసుము వసూలు చేయరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు వాటిని బేఖాతరు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. ఈ అక్రమ వసూళ్లు విద్యాశాఖ అధికారులకు తెలియవా? తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సంబంధిత అధికారుల తనిఖీలు ఎక్కడ జరుగుతున్నాయో, ఎవరి ప్రోత్సాహంతో ఈ దందా కొనసాగుతోందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖ అధికారులు వెంటనే జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో తనిఖీలు నిర్వహించి, టీసీలను ఎలాంటి రుసుము లేకుండా జారీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు విద్యాధికారి పత్రికా ప్రకటన విడుదల చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.ఇకపై టీసీ పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేసే విద్యాసంస్థల ఎదుట టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాలు, ఆందోళనలు చేపడతామని ఎండి వాజీద్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రెమ్మ సతీష్, వెంకటేష్, రాజు, నారీ తదితరులు పాల్గొన్నారు. :::

## ప్రభుత్వ జూనియర్ కళాశాల కమాన్పూర్ (గుండారం)లో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

ప్రభుత్వ జూనియర్ కళాశాల కమాన్పూర్ (గుండారం)లో సోమవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్ మాట్లాడుతూ, నేటి యువత దేశ భవిష్యత్తు అని, విద్యార్థులు తమ లక్ష్యాల సాధనలో ఏకాగ్రతతో ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలు క్షణిక ఆనందాన్ని కలిగించినప్పటికీ, అవి వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు చదువుపై ఆసక్తి తగ్గిపోతుందని, భవిష్యత్తు అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని వివరించారు. విద్యార్థులు సోషల్ మీడియా, చెడు స్నేహాల ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాల వినియోగానికి ప్రోత్సహించే వారిని గమనిస్తే వెంటనే అధ్యాపకులకు, తల్లిదండ్రులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని, క్రీడలు, పుస్తక పఠనం, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.కమాన్పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఖలీల్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమని తెలిపారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేందుకు పోలీసులు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎవరైనా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని గుర్తిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.హెడ్ కానిస్టేబుల్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకోవాలని, ఒత్తిడులు లేదా సమస్యలు ఎదురైనప్పుడు మాదకద్రవ్యాల వైపు మళ్లకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడాలని సూచించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన, విజయవంతమైన జీవితాన్ని నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సతీష్, శ్రీనాథ్, జీశీష్ట్రఅవివవ, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం

**జగదేవపూర్ స్థానిక ఎస్ఐ కృష్ణారెడ్డి**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం మాదకద్రవ్యాల నిర్మూలన మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగదేవపూర్ ఎస్ఐ జె. కృష్ణారెడ్డి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక ఆర్థిక దుష్పరిణామాల గురించి వివరించి, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం విద్యార్థుల భవిష్యత్తు, విద్యాభ్యాసం కుటుంబ జీవితంపై చూపే ప్రతికూల ప్రభావాల గురించి అవగాహన కల్పించారు.కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ చాందికుమారి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వైపు ఆకర్షితులు కావద్దని ఇంటర్మీడియట్ వయస్సు ఒడిదొడుకుల వయస్సు ఇప్పుడు జాగ్రత్తగా ఉంటే భవిష్యత్తు అంతా బంగారు మాయమైతుందని తెలియజేశారు.ఎస్ ఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేకంగా ఈగిల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వారు టోల్ ఫ్రీ నంబర్ 1908కు కాల్ చేసి సమాచారాన్ని అందించవచ్చని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అదేవిధంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని, ఏవైనా వేధింపులు లేదా నేరాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కళాశాలలో తరచూ మాదకద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ అవగాహన, మహిళలపై నేరాల నిరోధం తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత మరియు ఉజ్వల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్ఐ శ్రీ జె. కృష్ణారెడ్డి సేవలను కళాశాల అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య

**అగ్నిధార న్యూస్ సిద్ధిపేట జిల్లా,**

జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన దేశెట్టి రాజు 36 కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, దేశెట్టి రాజుకు 2011 సంవత్సరంలో మూడుచింతలపల్లి గ్రామానికి చెందిన కనకలక్ష్మితో వివాహం జరిగింది. మృతుడికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఇటీవల గృహ నిర్మాణం కోసం తీసుకున్న రుణం (ఈఎంఐ) చెల్లింపుల విషయంలో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. గ్రామ పెద్దల సూచన మేరకు తమ భూమిలో కొంత భాగం విక్రయించి రుణభారం తీర్చాలని నిర్ణయించి అడ్వాన్స్ కూడా తీసుకున్నప్పటికీ, కుటుంబ కలహాలు కొనసాగాయి.ఈ నేపథ్యంలో భార్య కనకలక్ష్మి తన పుట్టింటికి వెళ్లిపోవడంతో రాజు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో తన నివాసంలోని పడకగదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి దేశెట్టి నర్సమ్మ ఫిర్యాదు మేరకు జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## డిమాండ్ ఉన్న సన్నరకం వరి సాగు చేసి ప్రభుత్వ బోనస్ పొందండి

**సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. అనిల్ కుమార్**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ప్రయోజనాలను పొందేందుకు రైతులు డిమాండ్ ఉన్న సన్నరకం వరి వంగడాలను సాగు చేయాలని ములుగు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. అనిల్ కుమార్ సూచించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు రేపటి నుండి నిర్వహించనున్న రైతువేదిక--విత్తన మేళాల్లో విత్తన డీలర్ల క్రింది సన్నరకం వరి విత్తనాలను విక్రయించనున్నట్లు తెలిపారు. బీపీటీ--5204 ఆర్ఎన్ఆర్--15048 కేఎన్ఎమ్--1638 కేఎన్ఎమ్--7715 డబ్ల్యూజీఎల్--44 హెచ్ఎంటీ సోనా జై శ్రీరామ్: ఈ సన్నరకం వంగడాలను సాగు చేయడం ద్వారా రైతులు ప్రభుత్వ బోనస్‌తో పాటు మంచి మార్కెట్ ధరలను పొందవచ్చని తెలిపారు.అలాగే, ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల వైవిధ్యీకరణలో భాగంగా కూరగాయలు, కంది, పెసర, మినుము తదితర ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను కూడా రైతులు విత్తన మేళాల ద్వారా కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు.విత్తన మేళాల నిర్వహణ నేపథ్యంలో విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు, విక్రయ నిబంధనలు మరియు వ్యవసాయ శాఖ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారులు జగదేవపూర్ వసంతరావు వర్గల్ శేష శేషాయిని ములుగు మర్కుక్ రాము తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి.

**ఆటో కార్మిక సంఘం సిఐటియుమండల గౌరవ అధ్యక్షులు గని శెట్టి డిమాండ్**

**యుద్ధ ముగిసిన ప్రజలకు ఉపశమనం కల్పించని ప్రభుత్వాలు**

**పరవాడ :** పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ముత్యమాంబ ఆటో కార్మిక సంఘంసిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పరవాడ మండలం వాడ చీపురుపల్లిలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షులుగనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పెరుగుతున్న జీవన వ్యయం, ఇంధన ధరల భారం కారణంగా ఆటో కార్మికులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

మంగళవారం 23 జూన్ 2026

అగ్నిధార



# వైద్య బోర్డు పునరుద్ధరణ, నియామక పత్రాల పునఃప్రారంభం ఐఎన్‌టీయూసీ పోరాట ఫలితమే

సౌకర్యాలపై ఆదాయపు పన్ను రద్దు..
కార్మికులకు సొంతింటి కల సాకారం చేస్తాం
కార్మిక హక్కుల సాధనలో ఐఎన్‌టీయూసీ ముందుంటుంది
: డా. బి. జనక్ ప్రసాద్

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**




సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి డా. బి. జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం రామగుండం--3 ప్రాంతంలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు--2 వద్ద నిర్వహించిన గేటు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి రామగుండం--3 ప్రాంత ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డా. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, కార్మికుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన వైద్య బోర్డు వ్యవస్థ పునరుద్ధరణతో పాటు నిలిచిపోయిన నియామక పత్రాల పంపిణీ పునఃప్రారంభానికి ఐఎన్‌టీయూసీ చేసిన పోరాటమే కారణమని అన్నారు. గుర్తింపు సంఘం వైఫల్యంతో నిలిచిపోయిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టిన ఘనత ఐఎన్‌టీయూసీకే దక్కుతుందన్నారు. సౌకర్యాలపై విధిస్తున్న ఆదాయపు పన్ను రద్దు కోసం వచ్చే ఆర్థిక సంవత్సరంలోపు ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని తెలిపారు. పేర్ల మార్పు సమస్య పరిష్కారం కోసం కార్మిక సంఘం--యాజమాన్య సంయుక్త కమిటీకి ప్రతిపాదనలు సమర్పించినట్లు వెల్లడించారు. ప్రతి కార్మికుడి సొంతింటి కలను సాకారం చేసే దిశగా కృషి కొనసాగుతుందని హామీ ఇచ్చారు. మాజీ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరిపై ఆయన విమర్శలు గుప్పించారు. ఖనిజాలు మరియు గనుల అభివృద్ధి, నియంత్రణ చట్టంకు మద్దతు, బొగ్గు గనుల వేలం, సింగరేణికి జరిగిన నష్టం, రాష్ట్ర ప్రభుత్వ బకాయిలు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కోయగూడెం బ్లాక్--3, సత్తుపల్లి బ్లాక్--3 వంటి విలువైన బొగ్గు గనులు సింగరేణికి దక్కకపోవడం వల్ల సంస్థకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆధారిత ఉద్యోగాల వయోపరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచడం, శాశ్వత కార్మికులకు రూ.1 కోటి ప్రమాద బీమా, కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల బీమా, లాభాల వాటా, బీసీ అనుసంధాన అధికారుల నియామకం, సౌర, ఉష్ణ విద్యుత్ ప్రాజెక్టుల విస్తరణ, హైదరాబాద్‌లో అత్యాధునిక ప్రత్యేక వైద్యశాల ఏర్పాటు వంటి పలు నిర్ణయాలు అమలులోకి వచ్చాయని పేర్కొన్నారు. సింగరేణి భవిష్యత్తు పరిరక్షణతో పాటు కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం ఐఎన్‌టీయూసీ ద్వారానే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, ఉపాధ్యక్షుడు దాస్, కార్యదర్శులు గడ్డం తిరుపతి యాదవ్, రామారావు, ఉయ్యాల కుమారస్వామి, గని కార్యదర్శులు మనోహర్, చారి, నాయకులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర, శాఖ, గని స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రతి పేదవాడికి ఇంటి కొరకు మరో ఇండ్ల పోరాటానికి

# వామపక్షాలు సంసిద్ధం

**హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు ఇళ్లు, ఇంటి స్థలం సాధించడమే లక్ష్యంగా వామపక్షపార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమం తరహాలో మరో పోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు వామపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. ఇందులో భాగంగా గుండ్ల సింగారం, గోపాల్ పూర్ తొలగించిన గుడిసెల స్థానాలలో పేదలకు ఇళ్ల కట్టించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఐ(ఎం) ఇతర వాపపక్ష పార్టీల ఆధ్వర్యంలో 10 వేల మందితో ఈ నెల 27న హనుమకొండలో భారీ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హనుమకొండ జిల్లాలోని గుండ్ల సింగారంలో పేదలు నిలువ నీడ కోసం వేసుకున్న గుడిసెలను అధికారులు బందిపోటు దొంగలల చోరబడి రాత్రి రాత్రికి వాటిని తొలగించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యుత్సాహంతో అధికారులు ఎక్కడెక్కడ గుడిసెలు తొలగించారో అక్కడ తిరిగి గుడిసెవాసులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని లేకపోతే ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తామని వారు హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ ఏ కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహా, కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ, సిపిఐ ఎంఎల్ సి నెల్లికంటి సత్యం, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, వరంగల్ జిల్లా సెక్రటరీ బాషామియా, హనుమకొండ జిల్లా పార్టీ కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ , సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్, ఎంసిపిఐ నాయకులు సుధాకర్, ఎస్ నాయకులు భరత్ పాల్గొన్నారు. **పేదలకు ఇళ్లను సాధించడమే లక్ష్యంగా సమరశీల పోరాటాలు : కూనంనేని సాంబశివరావు** సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని నిరు పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు దక్కేలా కమ్యూనిస్టు పార్టీలు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని వామపక్ష పార్టీలు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాయని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన దశల వారి ఉద్యమ కార్యాచరణను ఆయన వెల్లడించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం జూలై 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్దఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదల నుంచి దరఖాస్తులను సేకరించి జూలై 6న హైదరాబాద్ (ఇందిరాపార్క్) వేలాది మందితో ధర్నా నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పేదల నుంచి సేకరించిన దరఖాస్తులను నేరుగా సమర్పిస్తామన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి స్పందన మేరకు తమ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని వారు చెప్పారు. ఈ 'మహత్తర గుడిసెల పోరాటానికి' ఏ పేరు పెట్టాలనేది జూలై 2న సమావేశమై నిర్ణయించనున్నట్లు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. **అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి ఇళ్ళను కూల్చడం దుర్మార్గం** హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలో గత 4 ఏళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే అధికారులు, పోలీసులు దొంగల




మాదిరిగా అర్ధరాత్రి సమయంలో గ్రామంపై పడి ఎలాంటి విచక్షణ లేకుండా పేదల ఇళ్ళను కూల్చివేయడం దుర్మార్గమని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా బలవంతంగా లాగిపడేసి అడ్డంవచ్చిన యువకులు, వృద్ధుల కాళ్ళు చేతులు మడిచి మరీ బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి, సుమారు 300 నుండి 400 మందిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఒకప్పుడు అక్కడ ఉన్న 'కోమల కుంట' అనే చెరువును ప్రభుత్వం పూడ్చి, ఎస్ కాల్వను తవ్వేందుకు సిద్ధమైందని, ఇదే క్రమంలో ఉమ్మడి రాష్ట్రంలో 2009లోనే అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి సర్వే నంబర్ 174, 175 కింద ఉన్న 56 ఎకరాల భూమిలో దాదాపు 1400 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మరో 40 మందికి ఇక్కడే పట్టాలు ఇవ్వగా ప్రస్తుతం బాధితులు కేవలం 8 ఎకరాల పరిధిలోనే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ, కాల్వ ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేకపోయినా అధికారులు అత్సుహంతో గుడిసెలు కూల్చివేశారని, ఇప్పటికే ఈ సర్వే నంబర్లలోని వందలాది ఎకరాలు ఇతరుల ఆధీనంలో ఉన్నాయని, వాటిని ఎందుకు కూల్చివేయలేదని ఆయన ప్రశ్నించారు. ఈ కూల్చివేతలకు సంబంధించి స్థానిక ఎంఎల్ ఏ వివరణ కోరగా తనకు తెలియదని తప్పించుకున్నారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, సలహాదారు నరేందర్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇదే తరహాలో రెండు రోజుల కింద గోపాల్ ప్రాంతంలో సిపిఐ(ఎం) నాయకత్వంలో పేదలు వేసుకున్న గుడిసెలను కూడా ఎలాంటి దయాదాక్షిణ్యాలు లేకుండా కూల్చేసి, చుట్టూ ఫెన్సింగ్ వేశారన్నారు. గతంలో వెలుగుమట్లలోనూ ఇలాగే జరిగిందని, కూల్చేసిన చోటే మళ్ళీ ఇళ్ళు కట్టించి ఇస్తామని ప్రభుత్వం చెప్పడం వారి ద్వంద్వ విధానానికి నిదర్శనమని విమర్శించారు. గోపాల్ గుండ్ల సింగారం బాధితులకు వెలుగుమట్ల తరహాలోనే ప్రత్యామ్నాయ ఇళ్ళు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మహానగరంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో లక్షలాది మంది పేదలు 25, 30, 50 గజాల లోపు చిన్న చిన్న గుడిసెల్లో, మురికివాడల్లో నివసిస్తున్నారని వివరించారు. వీరంతా భూదాన్ భూములు, ప్రభుత్వ భూములు, మిగులు భూముల్లో దశాబ్దాలుగా ఉంటున్నారని వీరందరికి పట్టాలను ఇవ్వాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. **పేదలపై అక్రమ కేసులు అన్యాయం : అబ్బాస్** అబ్బాస్ మాట్లాడుతూ హన్మకొండ జిల్లా గుండ్ల సింగారం, గోపాల్ వెలుగుమట్ల, జగిత్యాల ప్రాంతాల్లో పేదలు వేసుకున్న దాదాపు 2 వేల గుడిసెలను ప్రభుత్వం అమానుషంగా కూల్చివేయడాన్ని సిపిఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. పేదలపై అక్రమంగా కేసులు బనాయించి 40 నుండి 50 రోజుల పాటు జైళ్లలో పెట్టడం అత్యంత దారుణమన్నారు. 2007లో జరిగిన భూపోరాటంలో ముదిగొండ కాల్పుల్లో ఏడుగురు పేదలు ప్రాణాలు కోల్పోయారని, ఆతర్వాతే అప్పటి సిఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు 'ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని' ప్రారంభించారని గుర్తు చేశారు. నాడు ఆ పథకం కింద పట్టాలు పొందిన వారి ఇళ్లను కూడా నేడు ప్రభుత్వం కూల్చివేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. **పేద ప్రజలపై బుల్డోజర్లు ఎక్కించకండి: గోవర్ధన్** ప్రభుత్వం పేద ప్రజలపై యుద్ధం చేయవద్దని, వారిపై బుల్డోజర్లు ఎక్కించి ఉసురు పోసుకోవద్దని కె.గోవర్ధన్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 'గుడిసె రహిత' లేదా ఇల్లు లేని కుటుంబం అంటూ ఏదీ లేకుండా, ప్రతి కుటుంబానికి నిలువ నీడ ఉండేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొంగల్లాగా, బందిపోట్లలాగా తెల్లవారు జామున వెళ్లి ఇళ్లను కూల్చడం సరైన పద్ధతి కాదన్నారు. కమ్యూనిస్టులుగా తాము ఎలాంటి గొంతెమ్మ కోరికలు కోరడంలేదన్నారు. కేవలం పేదలు తల దాచుకునేందుకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. **కబ్జాల చిట్టా ఇస్తాం.. చర్యలు తీసుకోండి: సుధాకర్** నిలువ నీడ లేని పేదల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్ట్ పార్టీలేనని, రాష్ట్రంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయో, ఎక్కడెక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములను అక్రమించుకున్నారో ఆ వివరాలన్నీ తాము ఇస్తామని, ధైర్యముంటే వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సుధాకర్ సవాల్ చేశారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని వెలుగులోకి తెచ్చింది కమ్యూనిస్టులేనని, బడా బాబుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడుతున్నది కూడా తామేనని స్పష్టం చేశారు. **అధికారుల అత్యుత్సాహంపై విచారణ జరపాలి : భరత్** కొంతమంది పోలీస్ అధికారులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు కొందరు పెద్దల అండతో పేదలపై అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఇళ్లను కూల్చివేస్తున్నారని భరత్ ఆగ్రహంవ్యక్తం చేశారు. అసలు ఈ కూల్చివేతలు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరుగుతున్నాయా లేక అధికారులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఒక వేళ ప్రభుత్వం నుండి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా, అధికారులే సొంత నిర్ణయాలతో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ పేదలపై దాడులకు తెగబడుతున్న అధికారులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## అధికారులతో ప్రభుత్వ విప్ సమీక్ష

ఈదురుగాలుల పట్ల విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలి..
రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలి..
నకిలీ విత్తనాలపై నిఘా పెట్టాలి..
ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..

అగ్నిధారన్యూస్ పెద్దపల్లి జూన్ 22



పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు విద్యుత్ శాఖ అధికారులతో జిల్లా సహకార అధికారి అలాగే ప్రాథమిక సహకార సంఘాల కార్యదర్శులతో వానాకాలం సీజన్ పట్ల ముందస్తుగా సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ..**

వానాకాలన్నీ దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ అధికారులు విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజయరమణ రావు సూచించారు. నియోజకవర్గంలో అవసరమైన కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అలాగే వానకాలంలో ఈదురు గాలుల ప్రభావం ఎక్కువగా ఉంటాయని వాటిని దృష్టిలో ఉంచుకొని రైతులకు వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేకుండా చూసుకోవాలి తెలిపారు. పెద్దపల్లి ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నూతనంగా నిర్మాణం చేపడుతున్న బైపాస్ రోడ్డు లో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటిని సురక్షితమైన, అనువైన ప్రదేశాల్లోకి మార్చాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని నియోజకవర్గంలో ఎలెక్ట్రిక్ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచనలు చేశారు. వానాకాలం సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎరువులు విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ప్రభుత్వ విప్ విజయరమణ రావు సూచనలు చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు అందరూ ముందస్తు ప్రణాళికలతో వ్యవహరించి రైతన్నలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మార్కెట్లో నకిలీ విత్తనాలపై నిఘా ఉంచి వాటి అమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఎ ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాల బారిన పడకుండా చూసుకోవాలని ఆదేశించారు. విత్తనాలు అనేవి నిబంధనలకు అనుగుణంగా సజావుగా అమ్మకాలు సాగేలా చర్యలు తీసుకోవాలని అలాగే రైతులు కేంద్రాల వద్ద ఇబ్బంది పడకుండా డిజిటల్ ఎంట్రీలు, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిసివో శ్రీమాల కి విజయరమణ రావు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, విద్యుత్ శాఖ ఎస్.ఈ గంగాధర్ డి.ఈ రాజబ్రహ్మ చారి, , ఎ.ఈ లు, ఎ.డి.ఈ లు, పాక్స్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక మాఫియా అక్రమాలకు బలైన నిండు ప్రాణం

**భద్రాద్రి కొత్తగూడెం :** అంబులెన్స్కు సైతం దారి ఇవ్వకుండా లారీలను రహదారిపై అడ్డంగా నిలిపడంతో ఒక నిండు ప్రాణం పోయింది. అంబులెన్స్ కు దారి లేకపోవడంతో కుటుంసభ్యులు భుజంపై రోగిని మోసుకెళ్లిన ఘటన ఇది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరు మండలం సాంబాయిగూడెం నుండి రామానుజవరం వరకు రహదారిపై అడ్డంగా ఇసుక లారీలు నిలిపారు. అదే మార్గంలో మణుగూరు మండలం దమ్మక్కపేట గ్రామంలో పురుగుల మందు తాగిన వంశీ(35) అనే వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా, కనీసం అంబులెన్స్కు కూడా ఇసుక లారీలు దారి ఇవ్వలేదు. చివరకు రోగి వంశీని భుజంపై మోసుకుని వెళ్ళే సరికి ప్రాణాలు కోల్పోయాడు. ఇసుక లారీలు రోడ్డును బ్లాక్ చేయడంతోనే వంశీ మృతి చెందాడని చేస్తున్న కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి: ఎమ్మెల్యే

**సూర్యాపేట :** పట్టణంలోని హుజూర్ నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జి వీ హాస్పిటల్ ను స్థానిక సభ్యురాలు పద్మావతి రెడ్డి ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె హెల్త్కెకప్పేయించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూదిన దినాభివృద్ధి చెందుతున్న కోదాడ పట్టణానికి జీ వీ హాస్పిటల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు కోదాడ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని డాక్టర్లకు యాజమాన్యానికి సూచించారు. పేదలకు అతి తక్కువ ఖర్చులో నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. వైద్యులు సేవాభావంతో పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, రాబోయే రోజుల్లో వైద్యం అంటే కోదాడ గుర్తుకు వచ్చేలా పనిచేయాలని గుర్తు చేశారు. జీవి హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది సేవలు అందుబాటులో ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో , కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నేని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్ పర్సన్ దేవరపల్లి మల్లేశ్వరి, కాంగ్రెస్ నాయకులు ఎర్నేని బాబు , కారింగుల అంజన్ గౌడ్, అమీనాబాద్ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు ,మున్సిపల్ కౌన్సిలర్లు, కందుల కోటేశ్వరరావు , కాంగ్రెస్ మహిళ నాయకులు కోదాడ టౌన్ లో ఉన్న వివిధ హాస్పిటల్ డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## 'నిరసన మాత్రమే చట్టవిరుద్ధమెందుకు అవుతుంది?'

**పోలీసులకు సీజేపీ ఫౌండర్ అభిజిత్ దీప్కే ప్రశ్న**
**రెండో రోజుకు చేరిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన**
**పరీక్షల అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యార్థుల బలవన్మరణాలపై ఆగ్రహం**
**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**

విద్యార్థుల బలవన్మరణాలపై ఎవరూ బాధ్యత వహించకపోతే, నిరసనను మాత్రమే చట్టవిరుద్ధమని ఎలా చెబుతారని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసన ఆదివారం రెండో రోజుకు చేరగా, పోలీసుల ప్రకటనపై స్పందిస్తూ ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థుల మరణాలు, పరీక్షల అవకతవకలపై తీవ్ర ఆందోళనలు ఉన్నప్పటికీ సంబంధిత మంత్రి పదవిలో కొనసాగడానికి ఏ నిబంధనలు అనుమతిస్తున్నాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే!

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com